మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 16-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:21 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 317 Issue: 317

16 మే 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:47 సూర్యాస్తమయం - సా. 6:37 తిథి అమావాస్య రా. 1:29ం వరకు తరువాత పాడ్యమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం భరణి సా. 5:27 వరకు తరువాత కృతిక యోగం సౌభాగ్య ఉ. 10:23 వరకు కరణం చతుష్పాద మ. 3:20 వరకు నాగవ రా. 1:29ం వరకు వర్జ్యం తె. 4:44 నుండి ఉ. 6:09 వరకు దుర్ముహూర్తం ఉ. 7:30 నుండి ఉ. 8:21 వరకు రాహుకాలం ఉ. 9:00 నుండి ఉ. 10:36 వరకు యమగండం మ. 1:48 నుండి మ. 3:25 వరకు గుళికాకాలం తె. 5:47 నుండి ఉ. 7:23 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:11 నుండి తె. 4:59 వరకు అమృత ఘడియలు మ. 1:15 నుండి మ. 2:40 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:46 నుండి మ. 12:38 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial



## బండీ.. కొడుకును అప్పజెప్పు

### పోక్సో కేసుపై రేవంత్ రెడ్డి


**నిందితుడు తప్పించుకోవడం తప్పు అని వెల్లడి**

న్యూఢిల్లీ: రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపుతున్న బండి భగీరథ్ పోక్సో కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్ పారిపోవడం తప్పు అని అన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. ఈ విషయంలో నైతిక బాధ్యత తీసుకోవాలని హితవు పలికారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న తన కుమారుడు బండి భగీరథ్‌ను పోలీసులకు అప్పగించాలని సూచించారు. పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తన కుమారుడిని.. -2 వ పేజీలో...

## బండి సంజయ్ పేరు వాడొద్దు

### సిటీ సివిల్ కోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మే 15 (ఈవార్తలు): బండి భగీరథ కేసులో సిటీ సివిల్ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ పేరును వాడొద్దంటూ సిటీ సివిల్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. బండి భగీరథ కేసులో తన పేరును వాడుతున్నారంటూ బండి సంజయ్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. విచారించిన కోర్టు.. బండి భగీరథ కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ పేరు వాడొద్దంటూ ఆదేశాలు జారీ చేసింది. బండి భగీరథ కేసు విషయంలో బండి సంజయ్ పేరును ఎక్కడా ఉపయోగించరాదని స్పష్టం తరువాయి 2 వ పేజీలో...




## మధ్యంతర బెయిల్ ఇవ్వలేం

### అరెస్టు చేయకుండా అడ్డుకోలేం

**బండి భగీరథ్ పోక్సో కేసులో హైకోర్టు వ్యాఖ్యలు**

హైదరాబాద్, మే 15 (ఈవార్తలు): బండి భగీరథ్ పోక్సో కేసులో హైకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌కు అరెస్ట్ చేయకుండా మధ్యంతర బెయిల్ ఇవ్వలేనని హైకోర్టు న్యాయమూర్తి స్పష్టం చేశారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు పూర్తి అయ్యాయి. అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలని భగీరథ్ తరఫు న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో తరువాయి 2 వ పేజీలో...



## పెట్రో ధరలు రూ.3 పెంపు

**వాహనదారులకు కేంద్రం షాక్**

**నాలుగేళ్ల తర్వాత ధరల్లో హైక్**

న్యూఢిల్లీ: వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం భారీ షాకిచ్చింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు సగటున రూ.3 పెంచుతున్నట్లు -2 వ పేజీలో...

# 47,000 కోట్లు

## భారత్‌లో యూఏఈ భారీ పెట్టుబడులు

### ప్రధాని మోదీకి దుబాయ్ ఘన స్వాగతం

### ఇరు దేశాల మధ్య రక్షణ, ఇంధన ఒప్పందాలు

### యూరప్ పర్యటనకు వెళ్లిన ప్రధాన మంత్రి



అబుదాబి: ఐదు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అబుదాబి విమానాశ్రయానికి యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ స్వయంగా వచ్చిన మోదీకి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతల మధ్య జరిగిన చర్చలలో రక్షణ సహా కీలక ఒప్పందాలు కుదిరాయి. భారత్‌లో 5 బిలియన్ డాలర్ల (దాదాపు 47 వేల కోట్లు) పెట్టుబడులకు యూఏఈ ముందుకొచ్చింది. ఈ పర్యటన ఆరంభం నుంచే స్పష్టమైన వ్యూహాత్మక ధోరణిని మోదీ ప్రదర్శించారు. ఇటీవల యూఏఈపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. యూఏఈ నాయకత్వానికి, ప్రజలకు సంఘీభావం తెలిపారు. హర్మూజ్ జలసంధిలో సురక్షిత నౌకాయానానికి భారత్ సహాకారం ఉంటుందని మోదీ స్పష్టం చేశారు. ప్రాంతీయ స్థిరత్వానికి, శాంతికి, ప్రపంచ ఇంధన, ఆహార భద్రతకు ఇది అత్యంత కీలకమని ఆయన అభివర్ణించారు. మోదీ చర్చల ఎజెండాలో ఇంధన భద్రతకే అధిక తరువాయి 2 వ పేజీలో...



## భోజ్‌శాల హిందూ ఆలయమే

**అక్కడ ముస్లింలు నమాజ్ చేయొద్దు.. హిందూ ఆలయ శిథిలాలతో కట్టడం**

**మధ్యప్రదేశ్ హైకోర్టు స్పష్టీకరణ.. జైన మందిరం అన్న మూడో పక్షం**

భోజ్‌శాల–కమాల్ మౌలా మసీదు కాంప్లెక్స్ వివాదంపై మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ వివాదాస్పద ప్రాంతాన్ని హిందూ ఆలయమేనని న్యాయస్థానం గుర్తించింది. 'ఈ ప్రదేశంలో హిందూ ఆరాధన కొనసాగింపు ఎన్నడూ నిలిచిపోలేదని మేం గమనించాం. పర్మార్ వంశానికి చెందిన రాజా భోజుడితో సంబంధం ఉన్న సంస్కృత విద్యాకేంద్రంగా ఈ వివాదాస్పద ప్రాంతం భోజ్‌శాల ఉండేదని చారిత్రక ఆధారాలు చెబుతున్నట్టు మా పరిశీలనలో తేలింది' అని మధ్యప్రదేశ్ హైకోర్ట్ ఇండోర్ బెంచ్ పేర్కొంది.




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,791 |
| వెండి (కిలో): | రూ.3,05,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,154 |

## ఇక ఆన్‌లైన్‌లో నీట్

**2027 నుంచి సీబీటీ పద్ధతిలో... కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**

### ఈ జూన్ 21న మాత్రం ఓఎంఆర్‌తోనే



దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోని ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ వంటి వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన నీట్ యూజీ పేపర్ లీక్ అంశం సంచలనం సృష్టించింది. దాంతో పరీక్షను రద్దు చేసిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ.. జూన్ 21న మళ్లీ నిర్వహించనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది నుంచి నీట్ నిర్వహణపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. నీట్‌ను ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తామని ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు.

న్యూఢిల్లీ: ఆయన మీడియాతో మాట్లాడుతూ.."నీట్ రీ ఎగ్జామ్ తేదీ ఖరారైంది. జూన్ 21న నిర్వహిస్తాం.. ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలపై విచారణకు ఆదేశించాం.. ఇప్పటికే సీబీఐ ఈ కేసును విచారిస్తోంది.. లీక్‌కు బాధ్యులపై కఠిన చర్యలు చేపడతాం... విద్యార్థులకు ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.. వాళ్లు నష్టపోకూడదనే ఉద్దేశంతో పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తున్నాం. వారి భవిష్యత్తు బాగుండేలా చూడటమే మా మొదటి లక్ష్యం.. మా ప్రధాన కర్తవ్యం పరీక్ష పారదర్శకంగా నిర్వహించడమే.. ఏటా ఎన్టీఏ కోటి మందికి పరీక్షలు తరువాయి 2 వ పేజీలో...

## రాహుల్ తర్వాత నేనే!

### 2034లో దేశ రాజకీయాల్లోకి వెళ్తా.. సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌లో నంబర్ 2 అవుతానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న ఆయన.. రాష్ట్ర రాజకీయాలతోపాటు జాతీయ రాజకీయాలపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలో ఉంచడమే తన టార్గెట్ అని వెల్లడించారు.



హైదరాబాద్, మే 15 (ఈవార్తలు): రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. 10 ఏళ్ల పాటు రాష్ట్రంలో ఉండి.. అనంతరం తర్వాతి తరానికి అవకాశం ఇస్తానని.. అప్పుడు జాతీయ రాజకీయాల్లోకి అడుగుపెడతానని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే తనకు గాంధీ కుటుంబానికి ఉన్న సాన్నిహిత్యాన్ని రేవంత్ రెడ్డి వివరించారు. 2034లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి తాను వెళ్తానని స్పష్టం చేశారు. అప్పటి వరకు తెలంగాణకు ముఖ్యమంత్రిగా తానే తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ప్రేమలో ఉన్నవారు, సురక్షితమైన బంధంలో కొనసాగే జంటలు ఒకరినొకరు కలిసి ఉన్నప్పుడు చాలా సౌకర్యవంతంగా, ఆహ్లాదకర వాతావరణంలో ఉన్నట్లు ఫీలవుతారట. వాళ్ల ఒడిలో సేదతీరితే వెంటనే నిద్రలోకి జారుకుంటారని తాజా అధ్యయనం పేర్కొంది.

## తెలంగాణ ఉద్యమకారులెవరు?

### గుర్తించేందుకు ప్రభుత్వం కమిటీ

### చైర్మన్‌గా కేశవరావు నియామకం



హైదరాబాద్, మే 15 (ఈవార్తలు): తెలంగాణ ఉద్యమంలో అమరులైన, స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఉద్యమకారులను గుర్తించి, వారి సేవలు–త్యాగాలను గౌరవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీకి రూపమిచ్చింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం జీఓ ఆర్టీ నం.679 జారీ చేసింది. తెలంగాణ ఉద్యమంలో కొందరు ప్రాణత్యాగం చేయగా, మరికొందరు శారీరక వైకల్యానికి గురయ్యారు. పలువురిపై కేసులు నమోదై జైలు జీవితం గడిపిన నేపథ్యంలో, వారి సేవలను అధికారికంగా గుర్తించాలనే చాలాకాలంగా ఉన్న డిమాండ్‌పై ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీకి ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు చైర్మన్‌గా తరువాయి 2 వ పేజీలో...




## భారత్‌పై పూర్తి నమ్మకం

**శాంతి స్థాపనలో కీలక పాత్ర**

**అమెరికన్లను అసలే నమ్మలేం**

**ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ**

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు, శాంతి స్థాపనకు భారత్ కీలక పాత్ర పోషించగలదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అన్నారు. ఈ ప్రాంతంలో శాంతి నెలకొనేందుకు ద్వైపాక్షిక, దౌత్యపరమైన చర్చలు మాత్రమే తరువాయి 2 వ పేజీలో...





## చిలుకూరు.. వీసా మాఫియా గుడి

**అమెరికా సెనేటర్ అనుచిత వ్యాఖ్యలు**

న్యూయార్క్: హెచ్–1బీ వీసాల మాటున అమెరికన్ల ఉద్యోగాలను కొల్లగొడుతున్నారని భారతీయులపై ఆ దేశ నాయకుడు తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రపంచవ్యాప్తంగా వీసా మాఫియా నడుస్తోందని, భారతీయులకు హైదరాబాద్‌లో వీసాల కోసం ఓ గుడి ఉందని చిలుకూరు బాలాజీ ఆలయంపై మిస్సోరీ సెనేటర్ ఎరిక్ ష్మిట్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. భారతీయులపై ముఖ్యంగా తెలుగువాళ్లపై తన అక్కసు వెళ్లగక్కారు. ఉపాధి ఆధారిత వీసా -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

16.5.2026

మేషం: సమాజంలో ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. కొత్త పనులు చేపట్టి విజయం సాధిస్తారు. నూతన వస్తులాభాలు పొందుతారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగస్థులకు నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

వృషభం: సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. వృత్తి, వ్యాపారాలలో ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. సోదరుల నుండి శుభాకార్య ఆహ్వానాలు అందుతాయి.

మిధునం: నూతన ఋణయత్నాలు చేస్తారు. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. దూరపు బంధువులను కలుసుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

కర్కాటకం: ఇంటాబయట మానసిక ఒత్తిడులు అధికమౌతాయి. ఆర్థిక పరిస్థితి కొంత గందరగోళంగా ఉంటుంది. నూతన ఋణయత్నాలు ఫలించవు. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి, వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

సింహం: ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. మొండి బాకీలు వసూలు చేసుకోగలుగుతారు. అనుకున్న పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలించి నూతన అవకాశాలు లభిస్తాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులు అధికారుల అండదండలతో ముందుకు సాగుతారు.

కన్య: ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ఆర్థిక వ్యవహారాలు కొంత నిరాశ పరుస్తాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. కొన్ని వ్యవహారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకపోవడం మంచిది కాదు. వృత్తి ఉద్యోగాల్లో స్థానచలన సూచనలు ఉన్నవి.

తుల: కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలు ఆశజనకంగా సాగుతాయి. ఆర్థికంగా అవసరానికి ధన సహాయం లభిస్తుంది.

వృశ్చికం: చేపట్టిన పనులలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. ఆర్థిక పరిస్థితి అంతగా అనుకూలించదు. వృత్తి వ్యాపారాల్లో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగాలలో అధికారుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. బంధుమిత్రులతో ఆలయాలు సందర్శిస్తారు.

ధనస్సు: చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దూరపు బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి. ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. నూతన వాహన యోగం ఉన్నది. వృత్తి వ్యాపారాలు లాభాల బాట పడతాయి. ఉద్యోగులకు అనుకూల వాతావరణం ఉంటుంది.

మకరం: ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. ఆప్తుల నుంచి శుభవార్తలు అందుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. దూరపు బంధువుల కలయిక ఆనందం కలిగిస్తుంది. సోదరులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి.

కుంభం: కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేయుట మంచిది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. వ్యాపారపరంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు ఉంటాయి.

మీనం: చేపట్టిన పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. బంధువులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. కొన్ని వ్యవహారాలలో సొంత ఆలోచనలు కలసిరావు. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగులకు నిరాశ తప్పదు.

# 47,000 కోట్లు

**మొదటి పేజీ తరువాయి**

ప్రాధాన్యం ఇచ్చారు. పెట్రోలియం నిల్వలపై వ్యూహాత్మక సహకార ఒప్పందం, వ్యూహాత్మక గ్యాస్ నిల్వల ఏర్పాటుకు ఇరు దేశాలు అంగీకరించాయి. భవిష్యత్తులో సమగ్ర ఇంధన భాగస్వామ్యం కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించారు. ఐదు బిలియన్ డాలర్ల పెట్టుబడుల్లో ఎమిరేట్స్ ఎన్బీడీ.. భారత్‌లోని ఆర్బీఎల్ బ్యాంకులో 3 బిలియన్ డాలర్లు, భారత్‌లో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఒక బిలియన్ డాలర్లు, సమ్మాన్ క్యాపిటల్‌లో ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్య ఒప్పందంపై కూడా సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం రక్షణ పారిశ్రామిక సహకారాన్ని మరింతగా పెంపొందించుకోనున్నారు. ఆవిష్కరణలు,



అధునాతన సాంకేతికతపై సహకారం, శిక్షణ, సంయుక్త విన్యాసాలు, సముద్ర భద్రత, సైబర్ సెక్యూరిటీ, సురక్షిత కమ్యూనికేషన్లు, సమాచార మార్పిడి బలోపేతం కానుంది. అలాగే, సీడాక్, యూఏఈకి చెందిన జీ-42 భాగస్వామ్యంతో 8 ఎక్సాఫ్లాప్ సూపర్ కంప్యూట్ క్లస్టర్ ఏర్పాటు, కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, దుబాయ్‌కు చెందిన డ్రైడాక్స్ వరల్డ్‌తో రెండు అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ప్రధాని మోదీ నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీ, యూఏఈ దేశాల పర్యటన మే 20తో ముగియనుంది. శుక్రవారం అబుదాబి పర్యటన ముగించుకుని, మోదీ యూరప్ పర్యటనకు బయలుదేరారు.

## బండి సంజయ్ పేరు వాడొద్దు

**మొదటి పేజీ తరువాయి**

చేసింది. తన పేరును ఉపయోగిస్తూ మీడియాలో ఎలాంటి వార్తలు రాయకుండా చూడాలని కోరారు. ఇప్పటివరకు మీడియాలో తన పేరుతో వచ్చిన ఈ కేసుకు సంబంధించిన వార్తలను డిలీట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టుకు విన్నవించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపి కోర్టు గ్యాగ్ ఆర్డర్ జారీ చేసింది.

### బాధితుల వివరాలు బయటపెట్టిన వారిపై కేసులు

బండి భగీరథ్ పోక్సో కేసులో బాధితురాలి ఫొటోలు, వీడియోలు, ఆడియోలు, వివరాలు వైరల్ చేస్తుండటం పట్ల పోలీసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలిక వివరాలు సోషల్ మీడియాలో పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు సైబరాబాద్ పోలీసులు వెల్లడించారు. సోషల్ మీడియాలో బాధిత మైనర్ బాలిక ఫొటోలు, వీడియోలు.. వారి తల్లిదండ్రుల వివరాలను పోస్ట్ చేసిన వారిపై, షేర్ చేస్తున్న వారిని గుర్తించే పనిలో పడ్డారు. ఈ నేపథ్యంలోనే మేడ్చల్ జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలకు దిగారు. జువెనైల్ జస్టిస్ యాక్ట్-సెక్షన్ 74 (మైనర్ల గుర్తింపును బహిర్గతం చేయడంపై నిషేధం).. జువెనైల్ జస్టిస్ యాక్ట్-సెక్షన్ 74 (మైనర్ల గుర్తింపును బహిర్గతం చేయడంపై నిషేధం) వంటి సెక్షన్ల ఆధారంగా కేసులు నమోదు చేసినట్లు పేట్ బషీరాబాద్ పోలీసులు వెల్లడించారు. బాధిత బాలిక, ఆమె కుటుంబ వివరాలను సోషల్ మీడియాలో బయటికి వెల్లడిస్తున్న వారిని గుర్తించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాంటి వివరాలను ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఖాతాల్లో షేర్ చేస్తున్న వారి ఐడీలు, సంబంధిత యూఆర్‌ఎల్‌ల ద్వారా ఆయా అకౌంట్లను మెయింటైన్ చేస్తున్న వారిని గుర్తించి.. చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు వాటి వివరాలను సంబంధిత అధికారులకు పంపించినట్లు పోలీసులు తెలిపారు.

## తెలంగాణ ఉద్యమకారులెవరు?

**మొదటి పేజీ తరువాయి**

వ్యవహరించనున్నారు. సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ-విప్ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములునాయక్, మోతె శోభన్ రెడ్డి నియమితులయ్యారు. సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీ ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ముందుగా స్పష్టమైన ప్రమాణాలను రూపొందించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. ఆ ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల జాబితాను సిద్ధం చేస్తుంది. అనంతరం వారికి ఎలాంటి గుర్తింపు, గౌరవం, సౌకర్యాలు కల్పించాలనే అంశాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది. కేశవరావు నేతృత్వంలోని కమిటీ అవసరమైతే అధికారులను పిలిపించుకోవచ్చు. సమాచారం సేకరించవచ్చు. సమావేశాలు నిర్వహించవచ్చు. అవసరమైన ఇతర వ్యక్తులు, అధికారులను కూడా సంప్రదించవచ్చు. కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి వీలైనంత త్వరగా సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులు కమిటీకి అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

## భారత్‌పై పూర్తి నమ్మకం

**మొదటి పేజీ తరువాయి**

మార్గం అని అబ్బాస్ అభిప్రాయపడ్డారు. బ్రిక్స్ సదస్సులో భాగంగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రస్తుతం ఇండియాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత యుద్ధాన్ని ముగించేందుకు ఇండియా ఎలాంటి నిర్మాణాత్మక ప్రతిపాదనతో వచ్చినా స్వాగతిస్తామని ప్రకటించారు. ప్రాంతీయ శాంతి భద్రతల్ని ప్రభావితం చేసే శక్తి ఇండియాకు ఉందని ఆయన అన్నారు. ఈ విషయంలో భారత్ అర్థవంతమైన ప్రతిపాదనతో వస్తే మద్దతు తెలుపుతామని చెప్పారు. అమెరికా, ఇజ్రాయెల్‌లతో యుద్ధానికి సైనిక చర్య ఎంతమాత్రం పరిష్కారం కాదన్నారు. హోర్ముజ్ వద్ద పరిస్థితి చాలా క్లిష్టంగా ఉందని, అయితే, ఇక్కడి నుంచి నౌకలు సురక్షితంగా కదిలేందుకు ఎలాంటి సాయం అందించడానికైనా ఇరాన్ సిద్ధంగా ఉందని ప్రకటించారు. అమెరికాపై విశ్వాసం లేకపోవడం వల్లే చర్చలు పురోగతి సాధించడం లేదని అభిప్రాయపడ్డారు. అమెరికాను తాము నమ్మకపోవడానికి పలు కారణాలున్నాయని, అయితే, అమెరికాకు మాత్రం ఇరాన్‌పై పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు.

## రాహుల్ తర్వాత నేనే!

**మొదటి పేజీ తరువాయి**

ఉంటానని తేల్చి చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడం.. అగ్రనేత రాహుల్ గాంధీని దేశానికి ప్రధానమంత్రిని చేయడం తన లక్ష్యమని వెల్లడించారు. ఇక తాను జాతీయ రాజకీయాల్లోకి వెళ్లిన తర్వాత.. రాహుల్ గాంధీ తర్వాతి స్థానంలో తాను ఉంటానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి కేంద్రంలో అధికారాన్ని కట్టబెట్టడమే రాహుల్ గాంధీ లక్ష్యమని.. కానీ ఆయనకు ప్రధానమంత్రి కావాలనే కోరిక లేదని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఆ పదవికి పోటీ పడాలని తానే వికారాబాద్ కాంగ్రెస్ పార్టీ సమావేశాల్లో ఒప్పించినట్లు చెప్పుకొచ్చారు. ఇక దేశంపై గాంధీ కుటుంబానికి విశ్వాసం ఉందని పేర్కొన్న రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాల వద్ద తనకు అతి తక్కువ సమయంలోనే మంచి పేరు వచ్చిందని వెల్లడించారు. గతంలో తాను టీడీపీలో 10 ఏళ్ల పాటు పనిచేశానని.. అయితే పార్టీని వీడిన సమయంలో కూడా స్వయంగా చంద్రబాబు నాయుడు వద్దకు వెళ్లి.. తన పరిస్థితి గురించి అర్థమయ్యేలా వివరించినట్లు చెప్పారు. ఇప్పటికి తనను చంద్రబాబు గౌరవిస్తారని తెలిపారు. పార్టీకి గుడ్‌బై చెప్పినప్పటికీ.. నేతల మధ్య మంచి సంబంధాలు ఉండటం అత్యంత అరుదు అని చెప్పారు. ఇక ప్రస్తుతం ప్రజలు స్విగ్గీ పాలిటిక్స్ కోరుకుంటున్నారని చెప్పిన రేవంత్ రెడ్డి.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అభ్యర్థి అని తేల్చి చెప్పారు. ముందు రాహుల్ గాంధీని పీఎం అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన తర్వాత ఇండియా కూటమిని కూడా ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరఫున ఒక పాలసీ డాక్యుమెంట్‌ను తీసుకువచ్చి.. సరైన తీర్పు ఇవ్వాలని దేశ ప్రజలను కోరనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. 2034 వరకు తాను తెలంగాణ రాష్ట్రంలోనే ఉండి.. ఇక్కడి ప్రజల కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. 10 శాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని తేల్చి చెప్పారు.

## పెట్రో ధరలు రూ.3 పెంపు

**మొదటి పేజీ తరువాయి**

ప్రకటించింది. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. పెరిగిన ధరలతో దేశ రాజధాని న్యూఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.97.77, డీజిల్ రూ.90.67కి పెరిగింది. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్‌పై రూ.3.39, డీజిల్‌పై రూ.3.26 వరకు పెరిగింది. దీంతో హైదరాబాద్‌లో పెట్రోల్ ధర రూ.110.89, డీజిల్ ధర రూ.98.96కి చేరింది. ఏపీలో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14 పెరిగింది. ఇక ముంబైలో పెట్రోల్ ధర రూ.106.68, డీజిల్ ధర రూ.95.13కి చేరింది. చెన్నైలో పెట్రోల్ ధర రూ.10.3.67, డీజిల్ ధర రూ.95.25కి పెరిగింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదల కారణంగా ఆయిల్ కంపెనీలపై భారం పడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కానీ ప్రధాని మోదీ పొదుపు మంత్రం పాటించాలని చెప్పిన రెండు మూడు రోజుల్లోనే ఈ ధరలు పెరగడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు ఇంధన ధరల పెంపుతో రవాణా ఖర్చులు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. దాని ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలు, ప్రయాణచార్జీలు తదితర రంగాలపై పడే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

## ఇక ఆన్‌లైన్‌లో నీట్

**మొదటి పేజీ తరువాయి**

నిర్వహిస్తోంది. అలాంటింది పేపర్ ఎలా లీక్ అయ్యింది.. ఎవరి ద్వారా బయటకు వెళ్లిందనే పూర్తి వివరాలు దర్యాప్తులో బయటకువస్తాయి. ఈసారి ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా పకడ్బందీగా నిర్వహిస్తాం.. రీ ఎగ్జామ్ కోసం తమకు నచ్చిన సెంటర్‌ను విద్యార్థులు ఎంపిక చేసుకోడానికి వారం రోజులు సమయం ఇస్తున్నాం. జూన్ 14న హాల్ టిక్కెట్లు విడుదల చేస్తాం. పరీక్ష కోసం మళ్లీ దరఖాస్తు, ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. సోషల్ మీడియాలో జరుగుతోన్న ప్రచారం చూసి విద్యార్థులు ఆందోళనకు గురికావద్దు.. పరీక్ష రద్దు చేయడం కలిగిన ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని రీఎగ్జామ్‌లో విద్యార్థులకు అదనంగా 15 నిమిషాల సమయం ఇవ్వనున్నాం" అని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. వచ్చే ఏడాది నుంచి నీట్ యూజీ పరీక్షలు కంప్యూటర్ ఆధారితంగా జరుగుతాయని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై స్పష్టతనిస్తూ, అక్రమాల పట్ల ప్రభుత్వానికి 'జీరో టాలరెన్స్' ఉందని ఆయన అన్నారు. 'పేపర్ లీక్‌కు మూల కారణం ఓఎంఆర్. అందువల్ల వచ్చే ఏడాది నుంచి పరీక్షను కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహిస్తాం' అని పేర్కొన్నారు.

## బండీ.. కొడుకును అప్పజెప్పు

**మొదటి పేజీ తరువాయి**

పోలీసులకు అప్పగిస్తే.. బండి సంజయ్‌పై ఉన్న గౌరవం రాష్ట్రంలో, దేశంలో పెరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎలాంటి కేసులు వచ్చినా.. ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఇలా కేసుల నుంచి పారిపోతే.. ఎదురైన సమస్యలకు పరిష్కారం లభించదని స్పష్టం చేశారు. కింది స్థాయి నుంచి కష్టపడి బండి సంజయ్ ఈ స్థాయికి వచ్చారని తెలిపిన రేవంత్ రెడ్డి.. తన కుమారుడు బండి భగీరథ్ కారణంగా ప్రస్తుతం ఆయనకు తలవంపులు ఎదురయ్యాయని తెలిపారు. ఈ కేసులో బండి భగీరథ్‌ది తప్పు అయినా, ఒప్పు అయినా బండి సంజయ్ నిలబడి సమాధానం చెప్పాలని సూచించారు. బండి సంజయ్ వెంటనే తన కుమారుడిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని రేవంత్ రెడ్డి హితవు పలికారు. బండి భగీరథ్ పోక్సో కేసులో తప్పు ఎవరిది అనే విషయాన్ని దర్యాప్తు అధికారులు తేలుస్తారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## మధ్యంతర బెయిల్ ఇవ్వలేం

**మొదటి పేజీ తరువాయి**

మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న హైకోర్టు, తదుపరి విచారణలో తుది ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేసింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, వచ్చే గురువారం హై కోర్టు తీర్పు వెల్లడించే ఛాన్స్ ఉంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన ఈ కేసులో హైకోర్టు తాజా వ్యాఖ్యలు కీలకంగా మారాయి. కోర్టు నిర్ణయంతో రాజకీయ, న్యాయ వర్గాల్లో మరింత ఉత్కంఠ నెలకొంది.

## చిలుకూరు.. వీసా మాఫియా గుడి

**మొదటి పేజీ తరువాయి**

వ్యవస్థపై ఆరోపణలు చేసిన ఆయన.. స్థానిక వేతన వ్యవస్థలను ఒత్తిడికి గురిచేస్తోందని దుయ్యబట్టారు. అంతర్జాతీయ మాఫియాను సృష్టిస్తోందని, అమెరికన్ల ఉద్యోగాలను హరిస్తోందని ఆరోపించారు. హెచ్1బీ, ఎల్1, ఎఫ్1, ఓపీటీలు అమెరికన్లను నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. 'ఈ వీసా మాఫియాకు ఒక వీసాల ఆలయం ఉంది. వేల మంది ఈ గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటారు. అమెరికా వర్క్ వీసాలు, పాస్‌పోర్టులకు ఆశీర్వాదం తీసుకుంటారు' అని ష్మిట్ ఆరోపిస్తూ చిలుకూరు ఆలయం ఫోటోను ఎక్స్ (ట్విట్టర్)లో షేర్ చేశారు. ఇదే వీసాల ఆలయం.. భారతీయులతోపాటు వీసా మాఫియా అమెరికా వీసాల కోసం ఇక్కడ ప్రత్యేకంగా పూజలు చేస్తుంటారని విమర్శించారు. ప్రస్తుతం బిలియన్ల డాలర్లు ఏఐ శిక్షణ కోసం భారత్‌కు వెళ్తోందని, దీనికి అమెరికా రాయితీలు అందిస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో భారతీయ విద్యార్థులపై మిస్సోరి సెనేటర్ తన అక్కసు వెళ్లగక్కారు. విదేశీ విద్యార్థుల్లో సగం మంది భారతీయులేనని, వారు పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో రాయితీపై వర్క్ పర్మిట్లను పొందుతున్నారని ఆరోపించారు. ఉన్నత విద్య పూర్తిచేసిన తర్వాత హెచ్1బీ వీసాలు అనంతరం గ్రీన్‌కార్డులు పొందుతారు. తక్కువ వేతనాలకు పనిచేసే వీళ్ల కారణంగా అప్పులతో ఇబ్బందులుపడే అమెరికా గ్రాడ్యుయేట్లు పోటీపడాల్సి వస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాదు, వీసా మాఫియా పని అంతటితో ముగియదని, ఇంటర్వ్యూలో అడిగే ప్రశ్నల వివరాలను కూడా వీసా దరఖాస్తుదారులతో వీరు పంచుకుంటారని విమర్శించారు.

# భోజ్‌శాల హిందూ ఆలయమే

**అక్కడ ముస్లింలు నమాజ్ చేయొద్దు**

**హిందూ ఆలయ శిథిలాలతో కట్టడం**

**మధ్యప్రదేశ్ హైకోర్టు స్పష్టీకరణ**

**జైన మందిరం అన్న మూడో పక్షం**

ఇండోర్: భోజ్‌శాల-కమాల్ మౌలా మసీదు కాంప్లెక్స్ వివాదంపై మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ వివాదాస్పద ప్రాంతాన్ని హిందూ ఆలయమేనని న్యాయస్థానం గుర్తించింది. 'ఈ ప్రదేశంలో హిందూ ఆరాధన కొనసాగింపు ఎన్నడూ నిలిచిపోలేదని మేం గమనించాం. పర్మార్ వంశానికి చెందిన రాజా భోజుడితో సంబంధం ఉన్న సంస్కృత విద్యాకేంద్రంగా ఈ వివాదాస్పద ప్రాంతం భోజ్‌శాల ఉండేదని చారిత్రక ఆధారాలు చెబుతున్నట్టు మా పరిశీలనలో తేలింది' అని మధ్యప్రదేశ్ హైకోర్ట్ ఇండోర్ బెంచ్ పేర్కొంది. భోజ్‌శాలను వాగ్దేవి (సరస్వతీ దేవి)కి అంకితం చేసిన ఆలయంగా హిందువులు పరిగణిస్తుండగా, ముస్లిం వర్గం ఈ కట్టడాన్ని కమల్ మౌలా మసీదుగా గుర్తిస్తోంది. జైన సమాజానికి చెందిన ఒక పిటిషనర్ ఈ సముదాయం మధ్యయుగానికి చెందిన జైన ఆలయం, గురుకులమని వాదించారు. 2003 ఏఎస్ఐ (ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) ఒప్పందం ప్రకారం భోజ్‌శాలలో హిందువులు మంగళవారాల్లో, ముస్లింలు శుక్రవారాల్లో ప్రార్థనలు చేస్తున్నారు. అయితే ఆ ప్రాంగణంలో పూజలు చేసుకునే ప్రత్యేక హక్కులు తమకే కావాలని కోరుతూ.. హిందూ పక్షం హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. ఇది హిందూ ఆలయమేనని గుర్తించింది. విచారణ సమయంలో భారత పురావస్తు విభాగం సమర్పించిన నివేదిక.. ఇది ఒకప్పుడు హిందూ ఆలయాల సముదాయమని పేర్కొంది. అంతేకాదు, వాటి శిథిలాలతోనే మసీదు నిర్మాణం జరిగిందని తెలిపింది. రెండేళ్ల కిందట ఏఎస్ఐ 98 రోజులపాటు శాస్త్రీయ సర్వే జరిపి, 2 వేల పేజీలకుపైగా నివేదికను సమర్పించింది. మసీదు నిర్మాణం కంటే ముందే ఆ ప్రాంతంలో భారీ ఆలయం ఉన్నట్లు పలు శిల్పాలు, స్తంభాల శిథిలాలు, శాసనాలు తెలియజేస్తున్నాయని వివరించింది. అవి పర్మార్ రాజవంశం కాలానికి చెందినవని చెప్పింది. ఏఎస్ఐ తన శాస్త్రీయ సర్వేలో కనుగొన్న నాణేలు, శిల్పాలు, శాసనాలు ఈ సముదాయం వాస్తవానికి ఒక దేవాలయం అని నిరూపిస్తున్నాయని హిందూ పక్షం వాదిస్తోంది. కానీ, ఆ సర్వే నివేదిక పక్షపాతంతో ఉందని, హిందూ పిటిషనర్ల వాదనలకు మద్దతు ఇచ్చేలా తయారు చేశారని ముస్లిం పక్షం కోర్టులో వాదించింది. కానీ హైకోర్టు మాత్రం అది హిందువులకు చెందిన ప్రాంతమేనని నిర్ధారణకు వచ్చింది. ఇక్కడ హిందువులు పూజలు చేయడానికి అనుమతి ఇచ్చిన న్యాయస్థానం, ముస్లింలు నమాజ్ చేయకూడదని ఆదేశించింది. మరోవైపు, లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న వాగ్దేవి మాతా విగ్రహాన్ని వెనక్కి రప్పించే విషయాన్ని పరిశీలించాలని ప్రభుత్వానికి న్యాయస్థానం సూచించింది. మసీదు ఏర్పాటు కోసం ముస్లింలు కోరితే, వారికి ధార్‌లో ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ కేసులో వాదనలు పూర్తి కాగా.. మధ్యప్రదేశ్ హైకోర్టు తుది తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. కోర్టు సెలవులు ముగిసిన తర్వాత తుది తీర్పు వెలువడే అవకాశం ఉందని భోజ్ ఉత్సవ్ సమితి లాయర్ శిరీష్ దూబే పేర్కొన్నారు.

# ఫార్మా భవిష్యత్తుకు హైదరాబాద్ హబ్

## ఫార్మా మాక్‌టెక్ రోడ్‌షో సందేశం.. హైదరాబాద్‌లో ఈఈపీసీ భారత్ రోడ్‌షో

హైదరాబాద్, మే 15 (పీఐబీ): దేశ ఫార్మా, ల్యాబ్ పరికరాల రంగాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ఈఈపీసీ భారత్ హైదరాబాద్‌లో 'ఫార్మా మాక్‌టెక్ – ల్యాబ్‌నెక్స్ట్ ఎక్స్‌పో 2026' రోడ్‌షో నిర్వహించింది. ఫార్మా యంత్రాలు, ఆధునిక ల్యాబ్ పరికరాల తయారీలో భారత్‌ను ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దడంపై ఈ కార్యక్రమంలో చర్చలు జరిగాయి. పరిశ్రమల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, నిపుణులు పాల్గొని భవిష్యత్ అవకాశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హైదరాబాద్ ప్రాంతీయ సంయుక్త డీజీఎఫ్టీ అక్షయ్ ఎస్.సి మాట్లాడుతూ భారత ఫార్మా రంగ భవిష్యత్తు దేశీయ ఉక్కు, తయారీ రంగాల బలంపైనే ఆధారపడి ఉందన్నారు. ప్రపంచ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా భారత తయారీదారులు మారాలని సూచించారు. ప్రత్యేక యంత్రాల దేశీయ ఉత్పత్తిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈఈపీసీ భారత్ కార్యనిర్వాహక డైరెక్టర్ అధిప్ మిత్ర మాట్లాడుతూ అమెరికాకు ఫార్మా ఎగుమతులను 2030 నాటికి 130 బిలియన్ డాలర్లకు పెంచాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. విలువ ఆధారిత ఉత్పత్తులు, ఆవిష్కరణలతో కూడిన తయారీపై సంస్థలు దృష్టి పెట్టాలని సూచించారు. ఫార్మా 4.0, ఆటోమేషన్, ప్రిసిషన్ డ్రగ్ డెలివరీ వంటి ఆధునిక సాంకేతికతలను ఈ ఎక్స్‌పోలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. రోడ్‌షోలో భాగంగా 'స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, నెక్స్ట్–జెన్ లాబొరేటరీ పరిష్కారాలు' అనే అంశంపై ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. డిజిటల్ పరివర్తన, సుస్థిర తయారీ, ఆధునిక యంత్రాల వినియోగం, ఫార్మా పరిశ్రమలో కొత్త అవకాశాలపై నిపుణులు చర్చించారు. అంతర్జాతీయ వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సెమినార్లు, కొనుగోలుదారులు–విక్రేతల సమావేశాలు ఎంతో ఉపయోగపడతాయని అధిప్ మిత్ర తెలిపారు. ప్రపంచ వ్యాక్సిన్ సరఫరాలో దాదాపు మూడో వంతు, భారత బల్క్ డ్రగ్ ఉత్పత్తిలో 40 శాతం వాటా హైదరాబాద్‌కే ఉంది. జీడిమెట్ల, బాలానగర్, కూకట్‌పల్లి వంటి ఇంజనీరింగ్ క్లస్టర్లు ఫార్మా రంగానికి కీలక కేంద్రాలుగా మారాయి. అందుకే హైదరాబాద్‌లో ఈ రోడ్‌షో నిర్వహించడం ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. సెప్టెంబర్ 7 నుంచి 9 వరకు ఢిల్లీలోని భారత్ మండపంలో 'ఫార్మా మాక్‌టెక్ – ల్యాబ్‌నెక్స్ట్ ఎక్స్‌పో 2026' నిర్వహించనున్నారు.




ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మా ప్రదర్శనలలో ఒకటైన ఐపెక్స్‌తో కలిసి ఈ ఎక్స్‌పో జరగనుంది. ఫార్మా, మెడికల్, ఇంజనీరింగ్ రంగాలకు చెందిన పూర్తి విలువ గొలుసును ఒకే వేదికపైకి తీసుకురావడమే దీని ప్రధాన లక్ష్యం. కార్యక్రమంలో సీడీఎస్‌సీఓ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ కే. నరేంద్రన్, ఈసీజీసీ సీనియర్ మేనేజర్ సురేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు. పరిశ్రమల ప్రతినిధులు పరస్పర చర్చలు జరిపి కొత్త వ్యాపార అవకాశాలపై అవగాహన పెంచుకున్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అందరికీ ఈఈపీసీ భారత్ ఉప ప్రాంతీయ చైర్మన్ అరుణ్ శుక్లా కృతజ్ఞతలు తెలిపారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

– శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## 26న కేరళకు నైరుతి

**ముందుగానే పలకరించనున్న నైరుతి**

**24 గంటల్లో అండమాన్ దీవుల్లోకి ప్రవేశం**

విశాఖపట్నం, మే 15 (ఈవార్తలు): మాడుపగిలే ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు భారత వాతావరణ విభాగం చల్లని కబురు మోసుకొచ్చింది. వ్యవసాయ రంగానికి జీవనాధరమైన నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ముందుగానే వస్తున్నాయని తెలిపింది. రుతుపవనాలు మే 26న కేరళను తాకనున్నాయని ప్రకటించింది. సాధారణంగా జూన్ 1 నాటికి కేరళ తీరాన్ని రుతుపవనాలు తాకుతాయి. కానీ ఈసారి ఐదు రోజుల ముందే దేశంలోకి ప్రవేశించే అవకాశం ఉన్నట్లు ఐఎండీ వెల్లడించింది. మే 26న వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నాలుగు రోజులు అటు ఇటుగా మే 22– 30 మధ్య రుతుపవనాలు తాకే అవకాశం ఉంటుందని ఐఎండీ పేర్కొంది.కేరళను తాకి.. అక్కడి నుంచి కర్ణాటక మీదుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా దేశంలోని మిగితా ప్రాంతాలకు విస్తరిస్తాయి. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య నైరుతి రుతుపవనాలతో వర్షాలు అధికంగా కురుస్తాయి. వచ్చే 24 గంటల్లో దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల్లో రుతుపవనాలు విస్తరణకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. "భారత ప్రధాన భూభాగంలో రుతుపవనాల విస్తరణను కేరళలోకి వాటి రాకతో గుర్తిస్తాం. అధిక ఉష్ణోగ్రత, పొడి వాతావరణం నుంచి వర్షాకాలంలోకి జరిగే మార్పులను సూచించే ముఖ్యమైన సూచిక ఇది. రుతుపవనాలు విస్తరిస్తున్న కొద్దీ, ఆయా ప్రాంతాల్లో ఉండే తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం లభిస్తుంది" అని ఐఎండీ పేర్కొంది. అయితే, ఈ ఏడాది దేశంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. 'ఎల్ నినో' పరిస్థితులు ఏర్పడటమే దీనికి కారణం కావచ్చని అభిప్రాయపడింది. రుతుపవన కాలంలో సాధారణంగా సుమారు 80 సెం.మీ వర్షపాతం కురిసే అవకాశం ఉంది. అయితే, ఈ ఏడాది దీర్ఘకాలిక సగటు (1971–2020 మధ్య కాలం) 87 సెం.మీగా ఉంది. దేశ వ్యవసాయ రంగానికి నైరుతి రుతుపవనాలే జీవనాడి. నాలుగు నెలల కాలంలో దేశానికి లభించే వార్షిక వర్షపాతంలో దాదాపు 70 శాతం ఇవే అందిస్తాయి. వ్యవసాయం మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థకు, సాగునీటి ప్రాజెక్టులు, భూగర్భ జలాల పెరుగుదలకు ఇవే కీలకం. మన దేశంలో 50 శాతానికిపైగా సాగుభూమి ఇప్పటికీ వర్షధారమే.

# కుల కార్పొరేషన్లకు త్వరలో నిధులు

**పెరిక సమావేశంలో మంత్రి పొన్నం హామీ**

**కార్పొరేషన్ చైర్మన్‌గా దొంగరి వెంకటేశ్వర్లు,**

**వైస్ చైర్మన్‌గా బుడగం శ్రీనివాస్ బాధ్యతలు**

హైదరాబాద్, మే 15 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కుల కార్పొరేషన్లకు త్వరలోనే నిధులు కేటాయిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆయా కార్పొరేషన్ల విధులు, బాధ్యతలపై స్పష్టత ఇస్తూ ప్రత్యేక ఉత్తర్వులు కూడా జారీ చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వివిధ బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. పెరిక కుల కార్పొరేషన్ చైర్మన్‌గా దొంగరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌గా బుడగం శ్రీనివాస్ హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ కమిషనర్ బాలమాయా దేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గటిక విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీసీ సంక్షేమ శాఖతో పాటు కుల కార్పొరేషన్ల ద్వారా ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. ప్రతి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించడంతో పాటు ఆ



నిధులను ఎలా వినియోగించాలి, ఏ విధంగా కార్యక్రమాలు అమలు చేయాలి అనే విషయాలపై మార్గదర్శకాలు రూపొందిస్తామని వెల్లడించారు. తెలంగాణలో పెరిక కులం సమైక్యంగా ముందుకు సాగుతూ ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి అభినందించారు. 50 ఏళ్లకు పైగా విద్యార్థుల కోసం హాస్టల్ నిర్వహించడం గొప్ప విషయమని కొనియాడారు. ప్రస్తుతం బాలికల కోసం కొత్త హాస్టల్ నిర్మాణం చేపట్టడం కూడా అభినందనీయమన్నారు. కోకాపేటలో పెరిక కులస్తులు విరాళాలతో ఆత్మగౌరవ భవనం నిర్మించుకుంటుండటం సంతోషకరమని మంత్రి పేర్కొన్నారు. ఈ నిర్మాణానికి ప్రభుత్వం తరపున తప్పకుండా ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. సమాజ అభివృద్ధికి సంఘీభావంతో పనిచేస్తున్న పెరిక కుల నాయకత్వాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బీర్ల అయిలయ్య, పింగిళి శ్రీపాల్ రెడ్డి, గటిక విజయ్ కుమార్, మద్దా లింగయ్య, సుందరి వీరభాస్కర్, అందే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 90 ఏళ్ల ఆకాశవాణి వైభవం

## పల్లె పాటలతో ఘనంగా సంబురం.. తెలుగు వర్సిటీలో ప్రత్యేక వేడుక



హైదరాబాద్, మే 15 (ఈవార్తలు): ఆకాశవాణి 90 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా హైదరాబాద్‌లోని సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో "90 వసంతాల ఆకాశవాణి సంబరం – పల్లె పాటలు పండుగ" పేరుతో ప్రత్యేక జానపద విభావరి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జానపద కళలు, పల్లె సంస్కృతి, తెలంగాణ సంప్రదాయాలు ప్రతిధ్వనించాయి. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆకాశవాణి తెలంగాణ క్లస్టర్ హెడ్ బానోత్ హరిసింగ్ మాట్లాడుతూ 1936లో కలకత్తాలో కమ్యూనిటీ రేడియోగా ప్రారంభమైన ఆకాశవాణి ఇప్పటికీ ప్రజలకు నిరంతర సేవలు అందిస్తోందన్నారు. విజ్ఞానం, వినోదం, సమాచారాన్ని గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రతి వర్గానికీ చేరవేస్తోందని చెప్పారు. ప్రజా సేవే లక్ష్యంగా ఆకాశవాణి తన ప్రసారాలను కొనసాగిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ జానపద కళలకు ఆకాశవాణి ప్రత్యేక వేదికగా నిలిచిందని హరిసింగ్ తెలిపారు. మల్లన్న గాథలు, ఒగ్గు కథలు, చిందు యక్షగానాలు వంటి కళారూపాలు గ్రామీణ జీవన విలువలను ప్రతిబింబిస్తాయని చెప్పారు. భారతీయ సంస్కృతి, సంగీతం, సాహిత్యానికి ఆకాశవాణి అద్దం పట్టిందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ కవి, గోరేటి వెంకన్న మాట్లాడుతూ ఒకప్పుడు గ్రామాల్లో విద్యుత్ లేకపోయినా రేడియో ధ్వని మాత్రం ప్రతి ఇంటిలో వినిపించేదన్నారు. రైతుకు వ్యవసాయ సలహాలు, విద్యార్థికి విజ్ఞానం, గృహిణికి వినోదం అందించిన మహోన్నత సంస్థ ఆకాశవాణి అని కొనియాడారు. తెలుగు భాష వికాసం, జానపద కళల పరిరక్షణలో ఆకాశవాణి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో కూడా ఆకాశవాణి తన ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగిస్తోందని గోరేటి వెంకన్న పేర్కొన్నారు. ఈ 90 ఏళ్ల ప్రయాణం కేవలం ఒక సంస్థ చరిత్ర మాత్రమే కాదని, భారత సామాజిక–సాంస్కృతిక చరిత్రలో ఒక ముఖ్య అధ్యాయమని వివరించారు. అనంతరం ఆయన పాడిన జానపద గీతాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా ఒగ్గు ధర్మయ్య బృందం ప్రదర్శించిన ఒగ్గు కథ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా బీరప్ప కథ తెలంగాణ మట్టి వాసనను, గ్రామీణ జీవన శైలిని అద్భుతంగా ప్రతిబింబించింది. జానపద కళల సౌందర్యాన్ని ఆవిష్కరించిన ఈ ప్రదర్శనకు మంచి స్పందన లభించింది. ప్రముఖ జానపద సంగీత కళాకారుడు గడ్డం రమేష్ బృందం ఆలపించిన జానపద గీతాలు, పల్లె పాటలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ సంగీతంతో ప్రేక్షకులను ఉర్రూతలూగించిన ఈ ప్రదర్శనలు సభకు ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎన్వీ రమణ, ఎం.ఎస్. మహేష్, టి. ప్రసన్న, సీమకుమారి తదితర అధికారులు పాల్గొన్నారు. జానపద కళాకారులు, సంగీతాభిమానులు, ఆకాశవాణి శ్రోతలు హాజరయ్యారు.



## 20న మెడికల్ షాపుల బంద్‌కు మద్దతివ్వండి

**ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి విజ్ఞప్తి**

హైదరాబాద్, మే 15 (ఈవార్తలు): దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20వ తేదీన ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ చేపట్టిన దేశ వ్యాప్త బంద్ కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్ అధ్యక్షుడు డాక్టర్ గీసూలాల్ జైన్ తెలిపారు. మెడికల్ షాపుల బంద్ కు మద్దతు ఇవ్వాలని, పార్లమెంట్ లో తమ సమస్యను ప్రస్తావించి పరిష్కరించే విధంగా చూడాలని కోరుతూ శుక్రవారం పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. కెమిస్ట్స్ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించే విధంగా తన వంతు కృషి చేస్తానని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. అపోలో ఫార్మసీ మేనేజింగ్ డైరెక్టర్ శోభనారెడ్డి తో మాట్లాడి బంద్ కు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు తెలిపారు. నగరం లోని మెడికల్ షాపులను మూసివేసి బంద్ లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇ–ఫార్మసీ, ధరల సమస్యను పరిష్కరించి, కెమిస్టులు, రోగుల భద్రతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అధ్యక్షుడు డాక్టర్ ఘిసులాల్ జైన్, సంజయ్ కుమార్ మోడీ, ఆనంద్ కుమార్ గౌడ్, వికాస్ అగర్వాల్, సుధీర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్లకు పోలీసు కాపలా

**మహబూబ్‌నగర్ జిల్లాలో వంటగ్యాస్ సిలిండర్లకు భద్రత**

**దోపిడీ భయాల నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు**

**ఇద్దరు ఎస్సైల పర్యవేక్షణలో ఇంటింటికీ సిలిండర్ల పంపిణీ**

మహబూబ్‌నగర్, మే 15 (ఈవార్తలు): మహబూబ్‌నగర్ జిల్లాలోని పెద్ద ముప్పారం గ్రామంలో ఓ విచిత్ర దృశ్యం ఆవిష్కృతమైంది. ప్రముఖులకో, అత్యంత విలువైన వస్తువులకో కల్పించే తరహాలో.. వంటగ్యాస్ సిలిండర్ల పంపిణీకి పోలీసులు భారీ బందోబస్తు కల్పించారు. దోపిడీ జరగవచ్చన్న భయాల మధ్య సిలిండర్లతో వెళుతున్న వాహనానికి పోలీసు జీపులు ఎస్కార్ట్‌గా వెళ్లడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే, ఈ వారం పెద్ద ముప్పారం గ్రామంలో గ్యాస్ సిలిండర్లతో వస్తున్న ఆటో రిక్షాకు ముందు, వెనుక పోలీసు జీపులు రక్షణగా వెళ్లాయి. ఇద్దరు సబ్–ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రతి లబ్ధిదారుడికి సిలిండర్ సురక్షితంగా అందేవరకు అధికారులు ఆటోతో పాటు గ్రామంలోని వీధులన్నీ తిరుగుతూ విధుల్లో ఉన్నారు. గతంలో గ్యాస్ కొరత ఏర్పడినప్పుడు డెలివరీ వాహనాలను అడ్డగించి సిలిండర్లను బలవంతంగా తీసుకెళ్లిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో, దోపిడీ జరగకుండా, అర్హులైన వారందరికీ సిలిండర్లు చేరేలా చూడాలన్న డీలర్ల అభ్యర్థన మేరకు పోలీసులు ఈ భద్రతను ఏర్పాటు చేశారు. పోలీసుల పహారాలో గ్యాస్ పంపిణీని చూసి గ్రామస్థులు ఆశ్చర్యపోయారు. ఈ ఘటనకు సంబంధించిన చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించడంతో ప్రజల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. వంట గ్యాస్‌కు కూడా పోలీసు భద్రత కల్పించాల్సిన దుస్థితి వచ్చిందా అని కొందరు ప్రశ్నిస్తుండగా, అక్రమాలకు అడ్డుకట్ట వేసి, సరైన పంపిణీ జరిగేలా చూస్తున్న పోలీసుల చర్యను మరికొందరు ప్రశంసించారు.

# చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు

**మృగశిర కార్తె రోజున కార్యక్రమం.. మంత్రి పొన్నం ఉన్నతస్థాయి సమీక్ష**

హైదరాబాద్, మే 15 (ఈవార్తలు): హైదరాబాద్‌లో ఏటా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరిగే 'మృగశిర కార్తె చేప ప్రసాదం' పంపిణీకి రంగం సిద్ధమైంది. ఈ ఏడాది జూన్ 8వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ ప్రియాంక, బత్తిన కుటుంబ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు ఈ కార్యక్రమానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున,



ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని మంత్రి పోలీసులను ఆదేశించారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ మేనేజ్మెంట్, క్యూ లైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దశాబ్దాలుగా బత్తిన గౌడ్ కుటుంబం ఈ చేప ప్రసాదాన్ని ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఉబ్బసం, ఇతర శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారికి ఇది గొప్ప ఉపశమనాన్ని ఇస్తుందని భక్తుల నమ్మకం.

## కూలర్‌లో నీళ్లు పోస్తూ వ్యక్తి మృతి

మేడ్చల్ మల్కాజిరిగి, మే 15 (ఈవార్తలు): ఎయిర్ కూలర్‌లో నీళు నింపుతుండగా కరెంట్ షాక్ తగిలి 54 ఏళ్ల వ్యక్తి మృతి చెందిన ఘటన హైదరాబాద్‌లోని ఏఎస్ రావునగర్‌లో జరిగింది. మృతుడిని కృష్ణగా గుర్తించారు. కూలర్ ఆన్‌లో ఉండగానే అందులో నీళ్లు పోయడం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. నీళ్లు పోస్తున్న సమయంలో కృష్ణకు ఒక్కసారిగా కరెంట్ షాక్ తగలడంతో గట్టిగా కేకలు వేశారు. అది విన్న కుటుంబ సభ్యులు గదిలోకి పరుగెత్తుకు వచ్చారు. తీవ్రంగా గాయపడిన అతణ్ని చికిత్స కోసం వెంటనే దగ్గర్లోని హాస్పిటల్‌కు తరలించారు. అయితే ఆయన అప్పటికే మరణించినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. తెలంగాణలో ఇలాంటి విద్యుత్ ప్రమాదాలు ఇటీవల పెరిగిపోతున్నాయి. మే 9న మంచిర్యాల జిల్లాలో కూడా ఇదే తరహా ఘటనలో ఓ రైతు ప్రాణాలు కోల్పోయారు. బట్టలను ఇస్త్రీ చేసుకుంటుండగా కరెంట్ షాక్ తగిలి స్పృహ తప్పి పడిపోయారు. ఇస్త్రీ పెట్టె వైరింగ్‌లో ఉన్న లోపం వల్లే షాక్ తగిలిందని పోలీసులు తెలిపారు. ఆయనను హాస్పిటల్‌కు తరలించినా ఫలితం దక్కలేదు. ఘటనపై పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 194 కింద అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అమెరికాలో 22 ఏళ్ల భారత యువకుడికి జైలు

న్యూయార్క్: కెనడా నుంచి అమెరికాలోకి అక్రమంగా మనుషులను తరలిస్తున్న స్మగ్లింగ్ రాకెట్‌లో తన ప్రమేయం ఉన్నట్లు 22 ఏళ్ల భారత యువకుడు అంగీకరించాడు. శివమ్ అనే ఈ యువకుడు, భారతీయులతో పాటు ఇతర దేశస్థులను అక్రమంగా యూఎస్-కెనడా సరిహద్దు దాటించడంలో కీలక పాత్ర పోషించినట్లు అమెరికా న్యాయ విభాగం వెల్లడించింది. ఆర్థిక లబ్ధి కోసమే ఈ నేరానికి పాల్పడినట్లు అతను ఒప్పుకున్నాడు.

# ఈ సారి హైబ్రిడ్ మోడ్‌లో మహానాడు

మంగళగిరి, మే 15 (ఈవార్తలు): తెలుగుదేశం పార్టీ ఏటా నిర్వహించే 'మహానాడు' పండుగను ఈసారి హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయించింది. పశ్చిమాసియా యుద్ధం, దేశంలో నెలకొన్న చమురు సంక్షోభం (ఆయిల్ క్రైసిస్) కారణంగా పొదుపు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు తెలిపారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మే 27, 28 తేదీల్లో మహానాడును హైబ్రిడ్ పద్ధతిలో జరపనున్నట్లు పల్లా శ్రీనివాస రావు వివరించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి పొలిట్‌బ్యూరో, రాష్ట్ర స్థాయి సభ్యులు మాత్రమే హాజరవుతారని తెలిపారు. అదే సమయంలో, రాష్ట్రవ్యాప్తంగా 1,848 క్లస్టర్ల వద్ద ప్రత్యేకంగా స్క్రీన్లు ఏర్పాటు చేసి, ఒక్కో క్లస్టర్ వద్ద సుమారు 500 మంది కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పొదుపు చర్యల్లో భాగంగా, మే 18, 19, 20 తేదీల్లో జరగాల్సిన మినీ మహానాడులతో పాటు, 23, 24 తేదీల్లోని పార్లమెంట్ స్థాయి మహానాడులను కూడా రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. పార్టీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని నాయకులు, కార్యకర్తలు స్వాగతించాలని కోరారు.

# కాలు నరికేస్తే.. కుక్క పట్టేసింది!

**విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ఘోరం**

విజయవాడ, మే 15 (ఈవార్తలు): ఏపీలోని విజయవాడ కొత్త ప్రభుత్వాసుపత్రిలో దారుణం జరిగింది. ఓ వ్యక్తికి ఇన్‌ఫెక్షన్ సోకి తొలగించిన కాలును ఒక కుక్క నోట కరుచుకు వెళ్ళింది. వైద్యుల నిర్లక్ష్యమే దీనికి కారణమని ఆరోపణలు వస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు, ఒక రోగికి ఇన్‌ఫెక్షన్ సోకడంతో కాలును తొలగించారు. తొలగించిన కాలును బయో వేస్ట్‌లో భాగంగా తరలించేందుకు ఒక సంచిలో పెట్టి ఆసుపత్రి మొదటి అంతస్తులోని వ్యర్థాల గదిలో ఉంచారు. బయోవేస్ట్‌ను తరలించే 'సేఫ్' వాహనం, మున్సిపల్ కార్పొరేషన్ వాహనాలు మూడు రోజులకు ఒకసారి వస్తాయి. దీంతో తొలగించిన కాలును వ్యర్థాల గదిలో ఉంచారు. ఈ గదిలో భద్రతా ప్రామాణాలు పాటించకపోవడంతో ఒక కుక్క కాలును నోట కరుచుకు వెళ్ళింది. తలుపులు సరిగా మూసి ఉంచకపోవడంతో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలోకి ప్రవేశించిన ఒక కుక్క నేరుగా మొదటి అంతస్తులోని వ్యర్థాల గదిలోకి వెళ్ళింది. అక్కడ ఉన్న సంచిని నోట కరిచి బయటకు పరుగు తీసింది. ఆసుపత్రి వెలుపల కొంతదూరంలో కుక్క ఆ కాలులో కొంత భాగాన్ని పీక్కుని తిన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు ఆసుపత్రి సిబ్బంది, భద్రతా సిబ్బంది నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆరోపణలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా, ఘటన వెలుగులోకి రావడంతో ఆసుపత్రి సిబ్బంది వెంటనే కుక్కను వెంబడించి దూరంగా పడేసిన కాలి భాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నారు.



# పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు భూమిపూజ

**కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చంద్రబాబు హాజరు**

పుట్టపర్తి, మే 15 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌ను రక్షణ, వైమానిక రంగంలో కీలక కేంద్రంగా మార్చే దిశగా శుక్రవారం భారీ ముందడుగు పడింది. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సుమారు రూ.15,803 కోట్ల భారీ వ్యయంతో ఏర్పాటు చేయనున్న అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం ద్వారా దేశీయంగా ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్‌ల అభివృద్ధి, తయారీకి మార్గం సుగమం కానుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టుతో పాటు అనకాపల్లి జిల్లాలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) నావల్ సిస్టమ్స్ యూనిట్, కర్నూలులో ఏర్పాటు చేయనున్న 'డ్రోన్ సిటీ' సహా మొత్తం రూ.4,145 కోట్ల విలువైన మరో 12 రక్షణ ప్రాజెక్టులకు కూడా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. దేశానికి ఆంధ్రప్రదేశ్ రక్షణ కవచంగా నిలుస్తోందన్నారు. "ఒకప్పుడు రతనాల సీమగా ఉన్న రాయలసీమను మళ్లీ అదే స్థాయికి తీసుకెళ్లే బాధ్యత నాది. కడప స్టీల్ ప్లాంట్ పనులను జూన్‌లో ప్రారంభించి 2028 నాటికి పూర్తి చేసి సీమకు కానుకగా ఇస్తాం," అని ఆయన హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన రక్షణ ఉత్పత్తుల ప్రదర్శనను సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మంత్రి లోకేష్ తిలకించారు. ఇందులో అత్యాధునిక క్షిపణులు, తుపాకులు, హ్యాండ్ గ్రెనేడ్లు, యుద్ధ విమానం ప్రోటోటైప్‌లను పరిశీలించారు. ఈ ప్రాజెక్టులను డీఆర్‌డీవో ఆధ్వర్యంలోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) అభివృద్ధి చేస్తోంది.

# ఏపీ చీఫ్ సెక్రటరీ పదవీకాలం పొడిగింపు

అమరావతి, మే 15 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జి. సాయిప్రసాద్ సేవలను మరో ఆరు నెలల పాటు కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వాస్తవానికి ఆయన ఈ నెల 31న పదవీ విరమణ చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రత్యేక ప్రతిపాదనలను కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఆమోదించింది. ఈ పొడిగింపుతో ఆయన నవంబర్ 30 వరకు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా తన విధులను నిర్వర్తించనున్నారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఈ సీనియర్ ఐఏఎస్ అధికారిపై రాష్ట్ర ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని ఈ నిర్ణయం బలపరుస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుత పరిపాలనా పరిస్థితులు, కీలక ప్రాజెక్టుల కొనసాగింపు దృష్ట్యా సాయిప్రసాద్ అనుభవం అత్యవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు భావించారు. బడ్జెట్ రూపకల్పన, అమరావతి నిర్మాణ పనుల వేగవంతం ఇతర సంక్షేమ పథకాల అమలులో ఆయన కీలక భూమిక పోషిస్తున్నారు.

# మత్స్యరంగానికి 'సహకార' శక్తి

**హైదరాబాద్‌లో ఘనంగా జాతీయ వర్క్‌షాప్**

హైదరాబాద్, మే 15 (పీఐబీ): గత ఐదేళ్లలో సహకార రంగ అభివృద్ధికి 150కుపైగా కీలక కార్యక్రమాలు చేపట్టామని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఆశీశ్ కుమార్ భుటానీ తెలిపారు. మత్స్యకారులకు తక్కువ వడ్డీ రుణాలు, చల్లని నిల్వ కేంద్రాలు, మార్కెటింగ్ సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. హైదరాబాద్‌లోని షెరటాన్ హోటల్‌లో నిర్వహించిన "భారతదేశంలో మత్స్య సహకార సంఘాల బలోపేతం" జాతీయ వర్క్‌షాప్ దేశవ్యాప్తంగా మత్స్యరంగానికి కొత్త దిశను చూపించింది. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ, మత్స్యశాఖ, జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. "సహకార్ సే సమృద్ధి" లక్ష్యంగా చేపట్టిన ఈ సమావేశంలో ప్రభుత్వ అధికారులు, సహకార సంఘాల ప్రతినిధులు, ఆర్థిక సంస్థలు, నిపుణులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా మత్స్యకారుల జీవనోపాధి బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై విస్తృత చర్చ జరిగింది. ఈ సందర్భంగా భుటానీ మాట్లాడుతూ.. రెండు లక్షల కొత్త మల్టీపర్పస్ ప్యాక్స్ ఏర్పాటుకు రాష్ట్రాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గ్రామీణ స్థాయిలో సహకార సంఘాలను బలోపేతం చేస్తే రైతులు, మత్స్యకారులు నేరుగా ప్రభుత్వ పథకాల లబ్ధి పొందుతారని చెప్పారు. వర్చువల్‌గా పాల్గొన్న మత్స్యశాఖ కార్యదర్శి డాక్టర్ అభిలక్ష్ లిఖి.. దేశవ్యాప్తంగా 2028-29 నాటికి 6,000 కొత్త మత్స్య సహకార సంఘాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఉన్న 5,500 సంఘాలను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. పీఎంఎంఎస్‌వై, పీఎం-ఎంకేఎస్‌ఎస్‌వై వంటి పథకాల ద్వారా డిజిటలైజేషన్, మౌలిక వసతుల అభివృద్ధికి ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. స్వయం సహాయక సంఘాలు, ఫిష్ ఫార్మర్ ప్రొడ్యూసర్ సంస్థలు, స్టార్టప్‌ల భాగస్వామ్యాన్ని పెంచి మత్స్యరంగాన్ని మరింత విస్తరించాలనే ఉద్దేశాన్ని వెల్లడించారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈవో డాక్టర్ విజయ్ కుమార్ బెహరా మాట్లాడుతూ.. ఇప్పటికే అనేక రాష్ట్రాలు లక్ష్యాల కంటే ఎక్కువ సహకార సంఘాలను ఏర్పాటు చేశాయని తెలిపారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాలు



ముందంజలో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే కొన్ని రాష్ట్రాల్లో నిధుల విడుదల ఆలస్యం, డిజిటల్ పోర్టల్ సమస్యలు, రుణ భరోసా లోపాలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. కేరళలో అమలవుతున్న "మత్స్యాఫెడ్" సహకార మోడల్‌ను వర్క్‌షాప్‌లో ప్రత్యేకంగా ప్రశంసించారు. చేపల మార్కెటింగ్, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో ఈ మోడల్ విజయవంతమైందని నిపుణులు వివరించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా ఈ విధానాన్ని అనుసరించాలని సూచించారు. వర్క్‌షాప్‌లో సుమారు 150 మంది ప్రత్యక్షంగా, మరో 1250 మంది ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అధికారులు, నాబార్డ్, ఎన్‌సీడీసీ, నాఫెడ్, ఎస్‌ఎఫ్‌ఏసీ, ఐసీఏఆర్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.



# గల్ఫ్ నుంచి గుజరాత్‌కు భూగర్భ గ్యాస్‌లైన్

**రూ.40 వేల కోట్లతో ప్రాజెక్టుపై భారత్ దృష్టి**

**ఒమన్ నుంచి భారత్‌కు పైప్‌లైన్ ద్వారా దిగుమతి**

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు హర్మూజ్ జలసంధిలో ఇంధన రవాణాకు అంతరాయంతో ఆందోళనలు తీవ్రమవుతున్నాయి. దీంతో భారత ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా సముద్రగర్భంలో పైప్‌లైన్ ఏర్పాటుచేసి గల్ఫ్ నుంచి నిరంతరాయంగా గ్యాస్ దిగుమతి చేసుకునే ప్రయత్నాలను వేగవంతం చేస్తోంది. ఇంధన భద్రత ఒక కీలక ప్రాధాన్యతగా మారిన నేపథ్యంలో ఒమన్‌తో భారత్‌కు అనుసంధానించే ప్రతిపాదిత ప్రాజెక్టుపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. పెట్రోలియం మంత్రిత్వ శాఖకు చెందిన ఓ అధికారి ప్రకారం.. సుమారు రూ. 40,000 కోట్లు (4.7-4.8 బిలియన్ల డార్లు) ఖర్చవుతుందని అంచనా వేసిన ఈ ప్రాజెక్ట్‌కు ఆమోదం లభిస్తే, పూర్తి కావడానికి ఐదు నుంచి ఏడేళ్లు పట్టొచ్చు.భారత మొత్తం ఇంధన వినియోగంలో గ్యాస్ వాటా పెరుగుతుండటంతో డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుత వినియోగం రోజుకు సుమారు 190-195 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్లు ఉండగా... 2030 నాటికి ఇది దాదాపు 290-300కు పెరగొచ్చని అంచనా. ఈ దశాబ్దం ముగిసేలోపు ఎల్ఎన్‌జీ దిగుమతులు మాత్రం కేవలం 180-200కు చేరే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్ట్ సాధ్యాసాధ్యాలపై అంచనాలను రూపొందించాలని గెయిల్, ఇంజనీర్స్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌తో సహా ప్రభుత్వ రంగ సంస్థలను పెట్రోలియం మంత్రిత్వ శాఖ కోరనున్నట్లు సీనియర్ అధికారులు తెలిపారు. ప్రభుత్వం ప్రస్తుతం న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ప్రైవేట్ కన్సార్టియం సౌత్ ఆసియా గ్యాస్ ఎంటర్‌ప్రైజ్ (సా+జు) ప్రాథమిక నివేదికపై ఆధారపడుతోంది. సహజవాయువు సరఫరాలలో అంతరాయాలు, అంతర్జాతయ మార్కెట్‌లో ధరలు హెచ్చుతగ్గులు భారత్‌ను ఒత్తిడికి గురిచేస్తున్నాయి. దీర్ఘకాలిక ఇంధన స్థిరీకరణలో చైనా వంటి తయారీ రంగంపై ఎక్కువగా ఆధారపడిన ఆర్థిక వ్యవస్థలకు, భారతదేశానికి మధ్య ఉన్న అంతరాన్ని కూడా ఇది హైలైట్ చేస్తుంది. పూర్తిస్థాయి అధ్యయనం నివేదిక ఆధారంగా ముందుకు వెళ్లనున్నారు. భారత్, ఒమన్ ప్రభుత్వాల మధ్య అధికారిక చర్చలు జరుగుతాయి. పశ్చిమాసియా నుంచి ఒక సముద్ర గర్భంలో ప్రత్యేక పైప్‌లైన్ జల రవాణాలో అడ్డంకులు, ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని ఓ అధికారి అన్నారు. గ్యాస్ సరఫరాను అందిస్తుంది. దాదాపు 2 వేల కిలోమీటర్ల పొడవున్న ప్రతిపాదిత పశ్చిమాసియా భారత్ సముద్రగర్భ పైప్‌లైన్ అరేబియా సముద్రంలో ఒమన్ నుంచి నేరుగా గుజరాత్‌తో అనుసంధానం చేస్తుంది. రోజుకు దాదాపు 31 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను రవాణా చేస్తుందని అంచనా. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఒమన్, యూఏఈ, సౌదీ అరేబియా, ఇరాన్, తుర్కిమెనిస్తాన్, ఖతార్ వంటి దేశాల్లోని గ్యాస్ నిల్వలను కూడా భారత్ వినియోగించుకోగలుగుతుంది. అయితే, ఈ ప్రాజెక్ట్ సాంకేతికంగా అత్యంత క్లిష్టమైంది. సముద్ర ఉపరితలానికి 3,450 మీటర్ల లోతులో నిర్మించనున్నారు. ఇది ప్రపంచంలోనే లోతైన సముద్రగర్భ పైప్‌లైన్‌లలో ఒకటి కానుంది.

# ఐటీఆర్ ఫైలింగ్ ప్రారంభం

**2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి ఫైలింగ్**

**ఐటీఆర్-1, ఐటీఆర్-4 ఫారాల కోసం ఎక్సెల్ యుటిలిటీ**

**నాన్-ఆడిట్ పన్ను చెల్లింపుదారులకు గడువు జులై 31**

న్యూఢిల్లీ: పన్ను చెల్లింపుదారులకు ఆదాయపు పన్ను శాఖ ముఖ్యమైన అప్‌డేట్ ఇచ్చింది. 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి (2025-26 ఆర్థిక సంవత్సరం) సంబంధించిన ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్ (ఐటీఆర్) దాఖలు ప్రక్రియను అధికారికంగా ప్రారంభించింది. ఈ మేరకు ఐటీఆర్-1 (సహజ్), ఐటీఆర్-4 (సుగం) ఫారాలకు సంబంధించిన ఎక్సెల్ యుటిలిటీలను ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని ఆదాయపు పన్ను శాఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా తెలియజేసింది. పన్ను చెల్లింపుదారులు ఇప్పుడు ఈ రెండు ఫారాలను ఆన్‌లైన్‌లో నేరుగా ఫైల్ చేయవచ్చని లేదా ఎక్సెల్ యుటిలిటీని డౌన్‌లోడ్ చేసుకుని ఆఫ్‌లైన్‌లో కూడా నింపవచ్చని స్పష్టం చేసింది. ఆఫ్‌లైన్‌లో




ఫారం నింపిన వారు, ఆ తర్వాత జేసన్ ఫైల్‌ను జనరేట్ చేసి, ఈ-ఫైలింగ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆడిట్ పరిధిలోకి రాని పన్ను చెల్లింపుదారులు తమ రిటర్నులను దాఖలు చేయడానికి సాధారణంగా జులై 31 చివరి తేదీగా ఉంటుంది. ఐటీఆర్-1 (సహజ్) ఫారాన్ని రూ.50 లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్న నివాస భారతీయులు ఉపయోగించవచ్చు. ఇక, ఐటీఆర్-4 (సుగం) ఫారాన్ని రూ.50 లక్షల వరకు ఆదాయం ఉన్న వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), ఎల్ఎల్‌పీలు మినహా ఇతర సంస్థలు దాఖలు చేయవచ్చు. ఈ అసెస్‌మెంట్ సంవత్సరానికిగాను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) ఇప్పటికే కొత్త నిబంధనలతో కూడిన ఐటీఆర్ ఫారాలను నోటిఫై చేసింది. దీని ప్రకారం లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్, షేర్ల బైబ్యాక్ లావాదేవీల వల్ల కలిగిన నష్టాలు వంటి అదనపు వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది. కాగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశ నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 5.12% వృద్ధితో రూ.23,40,406 కోట్లకు చేరినట్లు సీబీడీటీ గణాంకాలు వెల్లడించాయి.

# పోలవరం నిర్వాసితులకు 306 కోట్ల ప్యాకేజీ

అమరావతి, మే 15 (ఈవార్తలు): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై తమ ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉందని, నిర్వాసితుల సంక్షేమం పట్ల ప్రత్యేక అభిమానంతో ఉన్నామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పుట్టపర్తి పర్యటన ముగించుకుని అమరావతి వచ్చిన ఆయన, శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో పోలవరం నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిర్వాసితులకు నాలుగో విడతగా రూ.306.61 కోట్ల పరిహారం, పునరావాస (ఆర్ అండ్ ఆర్) ప్యాకేజీని అందించారు. పలువురు లబ్ధిదారులకు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో నిర్మించిన ఇళ్ల తాళాలను అందజేశారు. సర్ ఆర్థర్ కాటన్ జయంతి రోజున నిర్వాసితులకు పరిహారం అందించడం సంతోషంగా ఉందని సీఎం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 23 నెలల్లో 29,936 మంది నిర్వాసితులకు సుమారు రూ.2,250 కోట్లు చెల్లించామని గుర్తుచేశారు. "ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులు నష్టపోకూడదనేదే నా ఆలోచన. అందుకే ప్రత్యేకంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేశాం. 2027లో జరిగే పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం" అని చంద్రబాబు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్లే పోలవరం ప్రాజెక్టు ఆలస్యమైందని, డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని ఆయన విమర్శించారు. "గత పాలకులు కాంట్రాక్టర్లను మార్చి, అధికారులను మార్చి ప్రాజెక్టును నాశనం చేశారు. మేం మళ్లీ ప్రాజెక్టును గాడిలో పెట్టాం. నిర్వాసితుల్లో ఒక్కరికి కూడా అన్యాయం జరగనివ్వను" అని భరోసా ఇచ్చారు. టెక్నాలజీని ఉపయోగించి గిరిజన ప్రాంతాల్లో ప్రతి కుటుంబ ఆదాయం పెంచుతామని, రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మాట్లాడిన నిర్వాసితులు, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాకే తమ సమస్యల పరిష్కారంపై నమ్మకం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పరిహారంపై ఆశలు వదులుకున్నామని, వరదల సమయంలో కనీస సహాయం కూడా అందలేదని వారు ఆవేదన చెందారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే తమకు మంచి రోజులు వచ్చాయని, పండుగల సందర్భంగా సైతం పరిహారం అందిస్తుండటం సంతోషంగా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, మిరియాల శిరీషా దేవి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విజయ్‌తో నన్ను పోల్చొద్దు

**ఏపీలో పరిస్థితి వేరు: పవన్ కల్యాణ్**

మంగళగిరి, మే 15 (ఈవార్తలు): ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న తర్వాత కోలుకున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన 'జనసేన ఉద్యమి' సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, గడిచిన కొన్నేళ్లలో తాను ఎదుర్కొన్న రాజకీయ సవాళ్లతో పాటు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను తొలిసారిగా వెల్లడించారు. గత ఎన్నికల్లో విజయం తన ఒక్కడిది కాదని, క్షేత్రస్థాయిలో నిబద్ధతతో పనిచేసిన ప్రతి జనసైనికుడు, వీరమహిళ, ఉద్యమిదేనని స్పష్టం చేశారు. పార్టీ భవిష్యత్ నిర్మాణం, భావజాల వ్యాప్తి, ప్రభుత్వంలో జనసేన పాత్ర వంటి కీలక అంశాలపై కార్యకర్తలకు సుదీర్ఘంగా వివరించారు. గత కొన్నేళ్లుగా తాను తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పోరాటం చేశానని పవన్ కల్యాణ్ వెల్లడించారు. "ఎన్నికలకు ఏడాది ముందు నుంచి ప్రచారంలో తిరగడం, కరోనా సమయంలో లంగ్ ఇన్ఫెక్షన్ రావడంతో నా ఆరోగ్యం దెబ్బతింది. ఆ ఇన్ఫెక్షన్ ఇప్పటికీ పూర్తిగా తగ్గలేదు. దుమ్ము, ధూళిలో తిరగడం వల్ల సైనస్ ప్రాంతంలో దుమ్ము పేరుకుపోయి గట్టిపడిపోయింది. దీనివల్ల నా గొంతు కూడా చాలాకాలం ఇబ్బంది పెట్టింది. ఒక దశలో కంటి చూపులో కూడా తేడా వచ్చింది. భీమవరంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకుని హైదరాబాద్ వెళ్లి చికిత్స




తీసుకోవడానికి నెల రోజులు పట్టింది," అని వివరించారు. అభిమానుల ప్రేమ వల్లే తన భుజాలకు గాయాలయ్యాయని పవన్ భావోద్వేగంతో తెలిపారు. "నా రెండు భుజాల్లో కండరాలు తెగిపోయాయి (టేర్). ఎలా జరిగిందని వైద్యులు అడిగితే, మా వాళ్లు ప్రేమతో లాగేశారు అని చెప్పాను. షేక్ హ్యాండ్ ఇచ్చినప్పుడు అభిమానులు ప్రేమతో గట్టిగా లాగడంతో కండరాలు తెగిపోయాయి. మీ ప్రేమతో తెగిన కండరాలను మళ్లీ మీ ప్రేమే బాగుచేస్తుంది," అని అన్నారు. వెన్నెముకలో కూడా 10 నుంచి 11 చోట్ల కంప్రెషన్స్ ఉన్నాయని, క్రీడా నేపథ్యం ఉండటంతో ఆ నొప్పిని తట్టుకోగలుగుతున్నానని తెలిపారు. "లోపల ఎంత నొప్పి ఉందో నాకే తెలియదు. నా పెయిన్ టాలరెన్స్ చాలా ఎక్కువ. అయినా మీ అందరి ఆశీస్సులతో నేను బాగుంటాను" అని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. తమిళనాడులో విజయ్ సాధించిన విజయంతో తనను పోల్చవద్దని పవన్ కల్యాణ్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు.



# కాంగ్రెస్‌ది రాక్షస ప్రభుత్వం

**బస్తాకు రూపాయి చొప్పున లారీ డ్రైవర్‌కా?**

**కొత్త సంప్రదాయానికి కాంగ్రెస్ సర్కారు నాంది**

**క్వింటాలుకు 7-8 కిలోలు కటింగ్**

**ఎమ్మెల్యే పై పీడీ యాక్ట్ పెట్టాలి: సుంకె రవిశంకర్**

మల్యాల, మే 15 (ఈవార్తలు): అధికారులు నిర్లక్ష్యం వీడి త్వరితగతిన వరి, మక్కల కొనుగోళ్లు వేగవంతం చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో మల్యాల మండలంలోని సర్వాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయడం లేదని, ఎక్కడికక్కడ కుప్పలు అలాగే ఉన్నాయని మండిపడ్డారు. 40 రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో లారీలతోపాటు హమాలీల సమస్య ఉందని, ధాన్యం తూకం లేక హమాలీకి పని లేక వారు ఉండడం లేదన్నారు. క్వింటాలుకు ఒక్క కిలోకి మించి కటింగ్ చేస్తే పీడీ యాక్ట్ చేయాలన్న ఇక్కడి ఎమ్మెల్యే మాటలు ఏమయ్యాయని ఈ సందర్భంగా ప్రశ్నించారు. మరి క్వింటాలకు 7 నుండి 8 కిలోలు కటింగ్ చేస్తున్నారు కదా, నీపై పీడీ యాక్ట్ పెట్టాలని అన్నారు. బస్తాకు ఒక రూపాయి చొప్పున లారీ డ్రైవర్ ఇవ్వాలని కొత్త సాంప్రదాయం నాంది పలికిన ప్రభుత్వాన్ని ఏమనలో అర్థం కావడం లేదు అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ గారి హయాంలో మే ఐదు నాటికి ధాన్యం కొనుగోలు పూర్తి అయ్యేవని, వారం పది రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేశామని అన్నారు. ఆరుకాలం పండించిన పంట కొనకుండా రైతులు అరిగోసపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న రోజుల్లో తప్పకుండా చెల్లించుకుంటుందని అని ఆరోపించారు. అనంతరం అధికారులతో ఫోన్లో మాట్లాడి కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు.



# ధన్వంతరి ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాల టౌన్, మే 15 (ఈవార్తలు): జగిత్యాల పట్టణం చింతకుంటలోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. లలితా సహస్ర నామాల స్తోత్ర పారాయణం అనంతరం అమ్మ వారికి ఒడి బియ్యం సమర్పించారు. కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వారా ఒక్కరిని ఎంపిక చేసి, అమ్మ వారి శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి భారతాల రాజసాగర్, మహిళా సభ్యులు వొడ్నాల లత, వడ్లగట్ట స్వాతి, భారతాల గీత, లక్ష్మి, లత, సంగీత, కృష్ణ వేణి, యశోద, దివ్య, నీరజ, రేఖా, రుచిత, కావ్య శ్రీ, సుజాత, భావన, అర్చకుడు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



# ఖుర్బానీ జంతువుల రవాణాకు భద్రత కల్పించాలి

కోరుట్ల, మే 15 (ఈవార్తలు): బక్రీద్ పండుగ సందర్భంగా ఖుర్బానీ కోసం చట్టబద్ధంగా తరలించే జంతువుల రవాణాకు పూర్తి భద్రత కల్పించాలని కోరుతూ కోరుట్ల ఎంఐఎం నాయకులు కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 28న బక్రీద్ పండుగ జరగనున్న నేపథ్యంలో ముస్లిం ప్రజలు సంప్రదాయం ప్రకారం ఖుర్బానీ నిర్వహించేందుకు అనుమతించబడిన బఫెలో ఎద్దులు, మేకలు, గొర్రెలను రవాణా చేస్తారని తెలిపారు. ప్రతి సంవత్సరం కొందరు వ్యక్తులు "గోమాత" పేరుతో అపార్థం చేసుకుని జంతువులను అడ్డుకోవడం, ముస్లింలపై దాడులకు పాల్పడడం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత చట్టాల ప్రకారం అనుమతించబడిన జంతువులనే ఖుర్బానీ కోసం వినియోగిస్తున్నప్పటికీ, కొందరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈసారి ముందస్తు చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని కోరారు. ఖుర్బానీ జంతువుల రవాణా సమయంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, అక్రమంగా అడ్డుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే స్లాటర్ హౌస్ పరిసరాలను మున్సిపాలిటీ తరపున శుభ్రపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం అధ్యక్షుడు ఎండి రఫీ, ప్రధాన కార్యదర్శి వాజిద్, నాయకులు రషీద్, రహీల్, చంద్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు ప్రారంభం



జగిత్యాల టౌన్, మే 15 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేయాలంటే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం మే 15 నుంచి జూన్ 15 వరకు కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రజలు అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేసుకుని రెడ్‌క్రాస్ సేవలకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రేమలేఖలు కాదు.. సీఎంను కలవాలి

**కేంద్రీయ వర్సిటీ కోసం అర్వింద్ చొరవ చూపాలి.. జూన్ 2నే పాఠశాలను ప్రారంభించాలి: జీవన్ రెడ్డి**



జగిత్యాల బ్యూరో, మే 15 (ఈవార్తలు): జీవన్ రెడ్డి రైతుల సమస్యలు, కేంద్రీయ విద్యాలయం స్థల వివాదం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు అంశాలపై తీవ్రస్థాయిలో స్పందించారు. జగిత్యాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పేరుకుపోవడం బాధాకరమన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ధాన్యం సేకరణ గణనీయంగా తగ్గిందని ఆయన పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం సమస్యలు, రవాణా లోపాలు, గన్నీ బ్యాగుల కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటను అమ్మేందుకు రోజులు తరబడి కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మార్కెట్ యార్డులో రైతుల అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ గోదాములను ప్రైవేట్ కాంట్రాక్టర్లు వినియోగిస్తున్నారని ఆరోపించారు. రైతులకు ఉపయోగపడాల్సిన సదుపాయాలు ఇతరుల చేతుల్లోకి వెళ్లడం దురదృష్టకరమని విమర్శించారు. వెంటనే అధికార యంత్రాంగం స్పందించి రైతులకు అందుబాటులో గోదాములను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కోసం స్థలం కేటాయింపు విషయంలో ప్రభుత్వం ఆలస్యం చేయొద్దని కోరారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు కూడా తక్షణమే భూమి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విద్యా సంస్థల ఏర్పాటు వల్ల జిల్లాలో విద్యార్థులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రైతు సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించిన ఆయన, ఎంపీ ధర్మపురి అరవింద్, స్థానిక ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి కలిసి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. "ప్రేమలేఖలు పక్కన పెట్టి ముఖ్యమంత్రిని నేరుగా కలిస్తే నిమిషాల్లో పని అవుతుంది" అంటూ వ్యాఖ్యానించారు.

# బక్రీద్ వేళ జగిత్యాల జిల్లాలో హైఅలర్ట్

**పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక తనిఖీలు.. ఎస్పీ సరిహద్దు చెక్‌పోస్టుల ఆకస్మిక తనిఖీ**



ధర్మపురి, మే 15 (ఈవార్తలు): బక్రీద్ పండుగ నేపథ్యంలో జగిత్యాల జిల్లాలో శాంతిభద్రతలు భద్రంగా కొనసాగేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పశువుల అక్రమ రవాణా, గోవధ నివారణపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు అశోక్ కుమార్ తెలిపారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన రాయపట్నం, రాజారాంపల్లె, చిల్వకోడూర్ చెక్‌పోస్టులను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ముఖ్యంగా పశువులను తరలిస్తున్న వాహనాలకు సంబంధించిన పత్రాలను పూర్తిగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి వాహనానికి సంబంధించిన వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించిన ఎస్పీ, పశువులను అక్రమంగా తరలించే వాహనాల తనిఖీల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అక్రమంగా గోవులను రవాణా చేస్తున్నారనే పేరుతో కొందరు వ్యక్తులు లేదా సంఘాలు బృందాలుగా ఏర్పడి చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం, అల్లర్లు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. చట్టాన్ని అమలు చేసే బాధ్యత పూర్తిగా పోలీసు శాఖదేనని, ఎవరూ స్వచ్ఛందంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనైనా ఉపేక్షించబోమని పేర్కొన్న ఆయన, ప్రజలు కూడా పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, ధర్మపురి సీఐ రామ్ నరసింహ రెడ్డి, ఎస్ఐలు మహేష్, ఉదయ్ కుమార్, కృష్ణసాగర్ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్లపై పశువులను వదిలేస్తే చర్యలు: పోలీసులు

జగిత్యాల/ధర్మపురి, మే 15 (ఈవార్తలు): జగిత్యాల: ప్రజల భద్రత దృష్ట్యా రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్న పశువులు, ఇతర సంచార జంతువుల వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని జగిత్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ పి. కరుణాకర్ హెచ్చరించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో, రద్దీ రహదారులపై ఆవులు, ఎద్దులు, గేదెలు, కుక్కలు అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. పశువుల యజమానులు తమ జంతువులను రోడ్లపై వదిలివేయకుండా సురక్షిత ప్రదేశాల్లో కట్టివేసి పర్యవేక్షించాలని సూచించారు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు ప్రమాదం కలిగించే విధంగా పశువులను నిర్లక్ష్యంగా రోడ్లపై వదిలేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే యజమానులపై కేసులు నమోదు చేసి, పశువులను గోశాలలకు తరలిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. అటు.. ధర్మపురి పట్టణంలోనూ రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్న పశువుల విషయంలో కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మపురి పోలీసులు, మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ దృష్ట్యా పశువులను రోడ్లపై వదలకుండా యజమానులు తమ ఇళ్ల వద్దనే కట్టివేయాలని ఇప్పటికే పలుమార్లు సూచించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో చాలా మంది యజమానులు స్పందించి తమ పశువులను సంరక్షించుకోగా, కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మూడు ఆవులు ప్రధాన రహదారులపై స్వేచ్ఛగా తిరుగుతూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై వెంటనే స్పందించిన పోలీసులు, మున్సిపల్ సిబ్బంది సంయుక్తంగా చర్యలు చేపట్టి ఆ మూడు ఆవులను సురక్షితంగా తాటిపల్లి గోశాలకు తరలించారు.



# రైస్ మిల్లుల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

ధర్మపురి, మే 15 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ధర్మపురి మండలంలోని జైన, రాజారాం గ్రామాల కొనుగోలు కేంద్రాలు, దుబ్బలగూడెం మొక్కజొన్న గోదాం, దమ్మన్నపేటలోని పరమేశ్వర, ధనలక్ష్మి రైస్‌మిల్లులను ఆకస్మికంగా పరిశీలించారు. ధాన్యాన్ని ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోలు నిర్వహించాలని సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో టార్పాలిన్ కవర్లు, గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. మిల్లుల్లో ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసి లారీలను త్వరగా పంపించాలని మిల్లర్లకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, సివిల్ సప్లైస్ డీఎం జితేంద్ర ప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# టీజీజీడీఏ నూతన కార్యవర్గం ప్రమాణం

జగిత్యాల, మే 15 (ఈవార్తలు): జగిత్యాల గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజీజీడీఏ) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత నూతనంగా ఎన్నికైన పదాధికారులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తామని సంకల్పం వ్యక్తం చేశారు. నూతన కమిటీలో డాక్టర్ అమరేశ్వర్ అధ్యక్షుడిగా, డాక్టర్ జయపాల్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా, డాక్టర్ జి. నవీన్ ఖజాంచీగా ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా, జగిత్యాల కంటి ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ మహమ్మద్ ముదసీర్ ఉద్దీన్, ఎన్నికయ్యారు, డాక్టర్ కొంతం ప్రవీణ్ బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ చైతన్య సుధా, డాక్టర్ పవన్ సోలేటి, డాక్టర్ జోష్నా రాణి ఎన్నికయ్యారు. జనరల్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ ఎ. విశాల్, డాక్టర్ సాజిద్ అహ్మద్, డాక్టర్ జి. శశికాంత్ రెడ్డి ఎంపికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా డాక్టర్ ఎం. రాజేశ్వర్, డాక్టర్ ఎస్. లక్ష్మి, డాక్టర్ ఎల్. పూర్ణచంద్రరావు, డాక్టర్ కృష్ణ చైతన్య, డాక్టర్ వి. శ్రావణ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సుభాష్ తదితర వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




# బదిలీ డీఎస్పీలకు సన్మానం

జగిత్యాల టౌన్, మే 15 (ఈవార్తలు): బదిలీపై వెళ్లనున్న డీఎస్పీలు రఘుచందర్, శ్రీనివాస్‌లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసింగ్ కార్యక్రమాల అమలులో వారు అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లాలో విధులు నిర్వహించిన కాలంలో ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని ప్రశంసించారు. పండుగలు, ఎన్నికలు, ప్రత్యేక బందోబస్తు, నేర నియంత్రణ, మత్తు పదార్థాల నిర్మూలన వంటి అంశాల్లో సమర్థవంతంగా పనిచేశారని పేర్కొన్నారు. ప్రతి అధికారి అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని, ఎక్కడ పనిచేసినా వృత్తి ధర్మంతో సేవలందించాలని అన్నారు. బదిలీపై వెళ్లనున్న డీఎస్పీలు మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో పనిచేసిన అనుభవాలు మరపురానివని తెలిపారు. జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో పనిచేయడం గర్వంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ధర్మపురి మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక

ధర్మపురి, మే 15 (ఈవార్తలు): ధర్మపురి పురపాలక సంఘ కార్యాలయంలో చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ కార్యవర్గ సమావేశంలో కో-ఆప్షన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్పెషల్ నాలెడ్జ్ కోటాలో మహిళా విభాగం నుంచి ఆశెట్టి మమత, జనరల్ కోటాలో గరిగే అరుణ ఎన్నికయ్యారు. మైనారిటీ కోటాలో మహిళా విభాగం నుంచి మొహ్మద్ నఫీజ్ సుల్తానా, జనరల్ కోటాలో షౌకత్ పాషా ఎంపికయ్యారు. ఎన్నికైన సభ్యులకు చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, వైస్ చైర్‌పర్సన్ ఇందారపు రామన్న శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు సంఘనబట్ల సంతోషి, జక్కు పద్మ, చిపిరిశెట్టి రాజేష్, ఒజ్జల లక్ష్మణ్, వంకుడోతు విజయ్‌బాబు, చుక్క సంధ్య, వేణుగోపాల్, సంగి ఆనంద్, జింజరికాని సువర్ణ, పవన్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కె. శ్రీనివాస్, మేనేజర్ బాలే గంగాధర్ పాల్గొన్నారు.










## సూర్య 'వీరభద్రుడి' రూపం

నీకు న్యాయం జరగాలంటే దేవుడు దిగిరావాలి అంటుంటారు కదా.. అలాంటిది న్యాయం కోసం ఆ దేవుడే మనిషి రూపంలో వస్తే అదే వీరభద్రుడు. నిజానికి చాలా మంచి లైన్ తీసుకున్నాడు దర్శకుడు ఆర్జే బాలాజీ. ప్రస్తుతం ఉన్న సమాజంలో దేవుడే దిగివచ్చినా, న్యాయం జరగదిక్కడ అనేది చాలా సెటైరికల్‌గా చెప్పాడు బాలాజీ. దేవుడైతే ఓకే.. దేవుడే మనిషైతే అతడి ఆటలు కూడా సాగవనేది ఈ సినిమా లైన్. చాలా ఇంట్రెస్టింగ్ లైన్ తీసుకున్న బాలాజీ.. దాన్ని అంతే ఇంప్రెసివ్‌గా తీయలేకపోయాడు. ఫస్టాఫ్ వరకు చాలా బాగా వెళ్లింది కథ.. ఎమోషనల్ డెప్త్ కూడా చాలా బాగుంటుంది. ఓ తండ్రీ కూతురు.. వాళ్లు చేసే న్యాయపోరాటం.. వాళ్ల కోసం దిగొచ్చే సూర్య. ఇంటర్వెల్ కూడా మాస్ బ్యాంగ్‌తో బాగానే ఇచ్చాడు దర్శకుడు. సెకండాఫ్‌లోనే అసలు సమస్యలన్నీ ఉన్నాయి. అక్కడక్కడా లాజిక్ లేని సన్నివేశాలు బాగా ఇబ్బంది పెడతాయి మాస్ ఆడియన్స్‌కు నచ్చేలా ఉన్నా.. ఎగ్జిగ్యూషన్ ట్రాక్ తప్పినట్లు అనిపిస్తుంది.. క్లైమాక్స్ మళ్లీ బాగా వర్కవుట్ అయింది. సూర్య గాడ్ మోడ్ ఆన్ చేసాడు.. వీరభద్రుడిగా విశ్వరూపం చూపించాడు. ఆర్జే బాలాజీ కాకుండా విలన్‌గా మరొకరు ఉండుంటే బాగుండేది. త్రిష పర్లేదు.. తండ్రీ కూతుళ్లుగా ఇంద్రాన్స్, అనఘా మాయ నటన బాగుంది. సాయి అభ్యంకర్ మ్యూజిక్ జస్ట్ ఓకే. దర్శకుడిగా కంటే రైటర్‌గా ఆర్జే బాలాజీ ఎక్కువ మ్యాజిక్ చేసాడు. ఓవరాల్‌గా వీరభద్రుడు.. దేవుడు చేసిన న్యాయపోరాటం..!


సమీక్షకుడు: ప్రవీణ్ కుమార్, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టు

## జాన్వీకి ఏమైంది?

హీరోయిన్ జాన్వీ కపూర్ ప్రస్తుతం బాలీవుడ్ తో పాటు టాలీవుడ్ లోనూ వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. అతిలోక సుందరి శ్రీదేవి కుమార్తెగా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన ఆమె, పాన్ ఇండియా రేంజ్ లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకునే దిశగా ముందుకెళ్తున్నారు. అయితే ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన చర్చ మొదలైంది. దేవర ప్రమోషన్స్ లో చురుగ్గా పాల్గొన్న జాన్వీ.. ఇప్పుడు పెద్ది విషయంలో ఎందుకు సైలెంట్ గా ఉన్నారనే ప్రశ్న వినిపిస్తోంది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సనా రూపొందిస్తున్న ఆ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో జాన్వీ అచ్చియ్యమ్మ అనే పవర్ ఫుల్ రోల్ లో కనిపించనున్నారు. పొలిటికల్ బ్యాక్ డ్రాప్ ఉన్న కుటుంబానికి చెందిన ధైర్యమైన అమ్మాయిగా కనిపించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లు, చికిరి చికిరి పాటలో జాన్వీ పూర్తిగా పల్లెటూరి అమ్మాయి లుక్ లో కనిపించారు. అందుకే సినిమా ఆమెకు నటిగా మరింత గుర్తింపు తీసుకురావొచ్చనే అభిప్రాయం కూడా ఉంది. అయితే సినిమా విడుదలకు ఇంకా దాదాపు 20 రోజులు మాత్రమే ఉండగా.. ఇప్పటివరకు జాన్వీ ప్రమోషనల్ ఈవెంట్లలో కనిపించలేదు. సోషల్ మీడియాలో కూడా పెద్దగా సందడి చేయడం లేదు. దీంతో జాన్వీ సైలెన్స్‌పై సోషల్ మీడియాలో చర్చ మొదలైంది.



## సృజనాత్మకతకు చోటులేదిక్కడ: సోనాక్షి



బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా ఇటీవలే తన కెరీర్ - పరిశ్రమలోని ప్రస్తుత పరిస్థితులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కళాకారులు , క్రియేటివ్ గా ఉండే వాళ్లు ఇప్పుడు క్లిష్టమైన కాలంలో జీవిస్తున్నామని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం సినిమాల ఎంపికలో గానీ, కథల విశ్లేషణలో గానీ గతంలో లేని విధంగా ఎన్నో పరిమితులు ,ఒత్తిళ్లు ఎదురవు తున్నాయని ఇది కళాకారుల స్వేచ్ఛపై ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ప్రభావం పెరిగిన తర్వాత ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూసే ధోరణి పెరిగిందన్నారు. ఒకప్పుడు వినోదం కోసం సినిమాలు చూసేవారని కానీ ఇప్పుడు ప్రతి సన్నివేశాన్ని విశ్లేషిస్తూ విమర్శలు చేయడం వల్ల దర్శకులు, రచయితలు తమ ఆలోచనలను స్వేచ్ఛగా ఆవిష్కరించలేకపోతున్నారని పేర్కొన్నారు. ఈ రకమైన సెన్సార్‌షిప్ మనస్తత్వం సృజనాత్మకతకు అడ్డంకిగా మారుతోందని అభిప్రాయపడ్డారు.



## కత్తితో బ్రిట్నీ స్పియర్ హల్‌చల్?



పాప్ స్టార్ బ్రిట్నీ స్పియర్స్ పేరు మరోసారి అంతర్జాతీయ మీడియాలో మారుమోగుతోంది. లాస్ ఏంజెల్స్‌లోని ఓ రెస్టారెంట్‌లో బ్రిట్నీ కత్తి పట్టుకుని అటు ఇటు తిరుగుతూ కనిపించిందనే వార్తలు సోషల్ మీడియాలో దావానాలా వ్యాపించాయి. దీంతో బ్రిట్నీ మానసిక స్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ నెటిజన్లు రకరకాల పోస్టులు చేయడంతో విషయం వివాదంగా మారింది. అయితే ఈ ఆరోపణలను బ్రిట్నీ స్పియర్ ప్రతినిధి బృందం తీవ్రంగా ఖండించింది. ఇవన్నీ పుకార్లు మాత్రమేనని ఎలాంటి నిజం లేదని వివరణ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దీనికి సంబంధించి బ్రిట్నీ స్పియర్స్ ప్రతినిధి స్పందించారు. ఆ రోజు రెస్టారెంట్‌లో జరిగిన విషయాన్ని కొందరు కావాలనే తప్పుగా చిత్రీకరించారన్నారు. ఆమె భోజనం చేస్తున్న సమయంలో టేబుల్ పై ఉన్న కత్తిని సాదాసీదాగా ఉపయోగించిందని అంతేకానీ ఎవరినీ భయపెట్టడానికో లేదా అసహజంగా ప్రవర్తించడానికో ఆమె ప్రయత్నించలేదన్నారు.

## హాట్ స్టార్‌లో ధురంధర్2 స్ట్రీమింగ్

ప్రముఖ డైరెక్టర్ ఆదిత్యధర్ దర్శకత్వంలో రణవీర్ సింగ్ హీరోగా .. గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం ధురంధర్. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతాకాదు. బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిన ఈ సినిమాకి కొనసాగింపుగా.. మార్చి 19వ తేదీన ధురంధర్ 2 అంటూ ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ సినిమా అంతకుమించి కలెక్షన్స్ వసూలు చేసింది.. సుమారుగా రూ.1900 కోట్లకు పైగా వసూళ్లను సాధించిన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ ఇండియాలోనే కాకుండా విదేశీ పరంగా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా పాకిస్తాన్ వంటి దేశాలలో కూడా ఈ సినిమా సత్తా చాటింది. అలాంటి ఈ సినిమా కోసం దేశీయంగానే కాకుండా విదేశీ ప్రియులు కూడా మంత్రముగ్ధులయ్యారు. ఓటీటీ స్ట్రీమింగ్ కోసం ఎంతగానో ఎదురు చూశారు..ఇక ఎదురుచూపుకు తెరదించుతూ.. ఎట్టకేలకు ఈ సినిమాను అందుబాటులోకి తీసుకొచ్చారు. కానీ అసలు ట్విస్ట్ తెలిసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం. అసలు విషయంలోకి వెళ్తే.. ఈ సినిమా ఓటీటీ హక్కుల విషయంలో జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ ల మధ్య విభజన జరిగింది. ముఖ్యంగా విదేశీ ఓటీటీ హక్కులను బడా ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకోగా.. మన ఇండియాలో జియో హాట్ స్టార్ దక్కించుకుంది. ఇక్కడ సర్ప్రైజ్ ఏమిటంటే థియేటర్లలో చూడని సన్నివేశాలను కూడా కలిపి ఇక్కడ "రా అండ్ ఉండేఖా "అనే ట్యాగ్ లైన్ తో సుమారుగా 3 గంటల 52 నిమిషాల సుదీర్ఘ అన్ కట్ వెర్షన్ ను విడుదల చేసింది.




## డేటింగ్ నా బిడ్డ ఇష్టం

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియారా అద్వానీ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సినిమాల కంటే ఎక్కువగా తన వ్యక్తిగత అభిప్రాయాలతో వార్తల్లో నిలిచే కియారా.. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో చేసిన వ్యాఖ్యలతో పెద్ద చర్చకు తెరలేపింది. ఫ్యామిలీ, పెళ్లి, పిల్లల పెంపకం వంటి విషయాలపై ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా పిల్లల జీవిత నిర్ణయాలు వాళ్లవే కావాలంటూ ఆమె చెప్పిన మాటలు యూత్‌లో ఒక వర్గానికి నచ్చగా, మరికొందరిలో తీవ్ర వ్యతిరేకతను రేకెత్తిస్తున్నాయి. రీసెంట్ గా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న కియారాకు ఫ్యామిలీ లైఫ్ గురించి ప్రశ్నలు ఎదురయ్యాయి. ఈ సందర్భంగా ఆమె చాలా ఓపెన్‌గా రియాక్ట్ అయ్యారు. తన కూతురు జీవితాన్ని స్వేచ్ఛగా అనుభవించాలని, ఆమె ఎవరితోనైనా డేటింగ్ చేయాలనుకుంటే అది తన సెలెక్షన్ అని, పెళ్లి చేసుకోవాలా వద్దా అనేది కూడా పూర్తిగా తన డెసిషనే అని కియారా తెలిపింది. ప్రతి రిలేషన్‌షిప్ మనిషికి ఏదో ఒక పాఠం నేర్పుతుందని, జీవితం అనుభవాల ద్వారా పరిపక్వతను అందిస్తుందని కియారా అభిప్రాయపడ్డారు.






# మార్ష్ తుఫాన్

## చెన్నైపై లక్నో ప్రతీకారం

ప్లే ఆఫ్స్ రేసులో నిలిచిన జట్లకు పోటీలో లేని జట్లు షాక్‌లు ఇస్తున్నాయి. పంజాబ్ కింగ్స్‌కు ధర్మశాలలో ముంబై ఇండియన్స్ ఝలక్ ఇవ్వగా.. విజయంతో ముందంజ వేయాలనుకున్న చెన్నై సూపర్ కింగ్స్‌ను లక్నో సూపర్ జెయింట్స్ ఓడించింది. ఆకాశ్ సింగ్(3-26) విజృంభణతో 187కు సీఎస్కే పరిమితమవ్వగా.. ఛేదనలో మిచెల్ మార్ష్(90) తుఫాన్ ఇన్నింగ్స్‌తో లక్నోను గెలుపు దిశగా నడిపాడు.

**వెంటవెంటనే మూడు వికెట్లు పడినా.. ముకుల్ చౌదరీ(13 నాటౌట్), నికోలస్ పూరన్(32 నాటౌట్)లు ప్రత్యర్థికి అవకాశమివ్వలేదు. కంబోజ్ ఓవర్లో పూరన్ నాలుగు సిక్సర్లతో లక్నో ప్రతీకార విక్టరీ సాధించగా.. చెన్నై ఐదో స్థానం వద్దే ఆగిపోయింది. పంతొమ్మిదో సీజన్‌లో ప్లే ఆఫ్స్ సమీకరణాలు ఆసక్తి రేపుతున్నాయి. జోరు మీదున్న జట్లు ముందంజ వేస్తాయనుకుంటే అనూహ్యంగా కంగుతింటున్నాయి.**

## చెన్నైకి షాకిచ్చిన పంత్ సేన

శుక్రవారం లక్నో సూపర్ జెయింట్స్ చేతిలో చెన్నై సూపర్ కింగ్స్ చిత్తుగా ఓడింది. విజయంతో నాలుగో స్థానానికి ఎగబాకాలనుకున్న సీఎస్కే ఆశలకు లక్నో చెక్ పెట్టింది. 188 పరుగుల ఛేదనలో లక్నో ఓపెనర్లు దంచికొట్టారు. మిచెల్ మార్ష్(90), ఇంప్యాక్ట్ సబ్ జోష్ ఇంగ్లిస్(36)లు పోటాపోటీగా ఆడారు. చెన్నై ప్రధాన పేసర్ అన్షుల్ కంబోజ్‌ను ఉతికేసిన మార్ష్ 5వ ఓవర్లో నాలుగు సిక్సర్లు, ఫోర్‌తో 28 రన్స్ పిండుకున్నాడు. మార్ష్ 28 బంతుల్లోనే అర్ధ శతకం సాధించగా పవర్ ప్లేలోనే లక్నో స్కోర్ 80 దాటింది. వీరబాదుడుతో లక్ష్యాన్ని కరిగిస్తున్న ఈ జోడీని ముకేశ్ చౌదరీ విడదీశాడు. ఇంగ్లిస్‌ను ఔట్ చేయడంతో 135 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే మార్ష్ రనౌటవ్వగా.. అబ్దుల్ సమద్(7)ను బౌల్డ్ చేసిన స్పెన్సర్ సీఎస్కే శిబిరంలో ఆశలు రేపాడు. టపటపా మూడు వికెట్లు పడంతో లక్నో స్కోర్ వేగానికి బ్రేకులు పడ్డాయి. అప్పటికే అవసరమైన పరుగులు తక్కువే కావడంతో ముకుల్ చౌదరీ(13 నాటౌట్), నికోలస్ పూరన్(32 నాటౌట్)లు దంచేశారు. కంబోజ్ వేసిన 17వ ఓవర్లో తొలి నాలుగు బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపిన పూరన్ లక్నోకు 7 వికెట్ల విజయాన్ని అందించాడు. ప్లే ఆఫ్స్ రేసులో నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ భారీ స్కోర్‌తో లక్నో సూపర్ జయింట్స్‌కు సవాల్ విసిరింది. ఆకాశ్ సింగ్(3-26) ధాటికి టాపార్డర్ విఫలమైనా కుర్రాడు కార్తిక్ శర్మ(71) మెరుపు అర్ధ శతకంతో లక్నో బౌలర్లను బెంబేలెత్తించాడు. ప్రధాన ఆటగాళ్లు ఔటైనా ఒత్తిడిలోనూ గొప్ప ఇన్నింగ్స్ ఆడిన కార్తిక్ భారీ స్కోర్‌కు బాటలు వేశాడు. ఆఖర్లో శివం దూబే(32 నాటౌట్) ధనాధన్ ఆడడంతో స్కోర్ 180 దాటింది. ప్రిన్స్ యాదవ్‌ను ఉతికేస్తూ 6, 4, ,4, 6తో దూబే రెచ్చిపోగా సీఎస్కే నిర్ణీత ఓవర్లలో వికెట్ల నష్టానికి రన్స్ చేసింది.

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| బెంగళూరు | 12 | 8 | 4 | 14 |
| గుజరాత్ | 12 | 8 | 4 | 16 |
| హైదరాబాద్ | 12 | 7 | 5 | 14 |
| పంజాబ్ | 12 | 6 | 5 | 13 |
| రాజస్థాన్ | 11 | 6 | 5 | 12 |
| చెన్నై | 12 | 6 | 6 | 12 |
| ఢిల్లీ | 12 | 5 | 7 | 10 |
| కోల్‌కతా | 11 | 4 | 6 | 9 |
| ముంబై | 12 | 4 | 8 | 8 |
| లక్నో | 12 | 4 | 8 | 8 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ-ఓడినవి పా-పాయింట్లు



## పొలార్డ్‌కు జరిమానా

ముంబై ఇండియన్స్ జట్టు బ్యాటింగ్ కోచ్ కీరన్ పొలార్డ్‌పై ఐపీఎల్ నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు అతడి మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా జతచేశారు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్ లో ఈ సంఘటన చోటుచేసుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో 19వ ఓవర్ సందర్భంగా పొలార్డ్, నాలుగో అంపైర్‌ను ఉద్దేశించి అసభ్య పదజాలం ఉపయోగించినట్లు తేలింది. ఇది ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.3 (మ్యాచ్ సమయంలో అసభ్య పదజాలం వాడటం) కింద లెవల్ 1 తప్పిదంగా నిర్ధారించారు. మ్యాచ్ రిఫరీ పంకజ్ ధర్మాని ఈ శిక్షను ఖరారు చేశారు. విచారణ సందర్భంగా పొలార్డ్ తన తప్పిదాన్ని అంగీకరించడంతో పాటు విధించిన జరిమానాను కూడా స్వీకరించినట్లు ఐపీఎల్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఆటగాళ్లు, సహాయక సిబ్బంది ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సంఘటన మరోసారి స్పష్టం చేసింది.

## జట్టుకు హీరోలు అవసరం: ద్రవిడ్

భారత క్రికెట్ జట్టులో సూపర్ స్టార్ కల్చర్‌ను అంతం చేయాలనే ప్రస్తుత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆలోచనా విధానంతో మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ విభేదించాడు. ఏ క్రీడకైనా హీరోలు చాలా అవసరమని, వారి అద్భుత ప్రదర్శనలే భావితరాలకు స్ఫూర్తినిస్తాయని స్పష్టం చేశాడు. 2024 టీ20 ప్రపంచకప్‌లో భారత్‌ను విజేతగా నిలిపిన తర్వాత తన పదవీకాలం ముగించుకున్న ద్రవిడ్, ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో ఈ కీలక వ్యాఖ్యలు చేశాడు. విస్డెన్ 'స్కూప్' పాడ్‌కాస్ట్‌లో ద్రవిడ్ మాట్లాడుతూ.. "ఏ ఆటకు అయినా హీరోలు అవసరం. మైదానంలో రాణించకుండా ఎవరూ హీరోలు కాలేరు. ముఖ్యంగా భారతదేశంలో ప్రశంసలతో పాటు విమర్శలు, ఒత్తిడి కూడా తీవ్రంగా ఉంటాయి. వాటన్నింటినీ తట్టుకుని నిలబడి, జట్టుకు విజయాలు అందిస్తేనే ఒక ఆటగాడు లెజెండ్ లేదా సూపర్‌స్టార్‌గా ఎదుగుతాడు. అలా ఎదిగారంటే వారు ఎన్నో సరైన పనులు చేసినట్టే" అని వివరించాడు. గంభీర్ విధానానికి భిన్నంగా ద్రవిడ్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ఇదే సమయంలో గంభీర్ కోచింగ్‌లో టెస్టు క్రికెట్‌లో భారత జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడంపై కూడా ద్రవిడ్ స్పందించాడు. "ఇటీవల కొన్ని టెస్టు సిరీస్‌లలో మనం సరిగ్గా ఆడలేకపోయాం. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్ వంటి దిగ్గజాలు రిటైర్ అవ్వడంతో వారి లోటు స్పష్టంగా కనిపిస్తోంది. అలాంటి ఆటగాళ్ల స్థానాన్ని భర్తీ చేయడం అంత సులభం కాదు. అయినా భారత క్రికెట్ ఇప్పటికీ చాలా బలంగా ఉంది. కొంత సమయం పట్టొచ్చు, కానీ జట్టు అన్ని ఫార్మాట్లలోనూ పోటీ ఇస్తుందని నేను నమ్ముతున్నాను" అని ద్రవిడ్ ధీమా వ్యక్తం చేశాడు. ప్రస్తుత తరానికి రెడ్-బాల్ క్రికెట్ ఆడాలనే తపన ఉన్నప్పటికీ, అధికంగా జరుగుతున్న పరిమిత ఓవర్ల క్రికెట్ కారణంగా వారు టెస్టులకు పూర్తిగా సిద్ధం కాలేకపోతున్నారని ద్రవిడ్ పేర్కొన్నాడు.

## ఇషాన్ కిషన్.. కోటీశ్వరుడు!

భారత యువకెరటం ఇషాన్ కిషన్‌కు భారీ నగదు ప్రోత్సాహం లభించింది. అంతర్జాతీయ టీ20ల్లో అదరగొడుతున్న ఈ చిచ్చరపిడుగును సొంత రాష్ట్ర ప్రభుత్వం రూ.1 కోటితో ఘనంగా సత్కరించింది. ఐపీఎల్ సమయంలో ఉన్నట్టుండి ఇషాన్‌కు ఇంత మొత్తం ఎందుకిచ్చారో తెలుసా.. టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించినందుకు. స్వదేశంలో భారత జట్టు సగర్వంగా టీ20 ప్రపంచకప్‌ను గెలుపొందడంలో భాగమైన ఇషాన్ కిషన్ భారీ కానుక అందుకున్నాడు. పాట్నాకు చెందిన ఇషాన్‌ను బిహార్ ప్రభుత్వం రూ.1 కోటి బహూకరించింది. శుక్రవారం ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరీ చేతుల మీదుగా ఇషాన్ కోటి రూపాయల చెక్కును అందుకున్నాడు. ఈ సందర్భంగా పాకెట్ డైనమైట్‌ను సీఎం అభినందించారు. కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రిని కలిశాడీ ఓపెనర్. పొట్టి వరల్డ్‌కప్‌లో ఇషాన్ 193.29 స్ట్రయిక్ రేటుతో 317 రన్స్ కొట్టాడు. ఇందులో మూడు అర్ధ శతకాలు ఉన్నాయి. కొలంబోలో పాకిస్థాన్‌పై మిగతా వాళ్లు తడబడినా.. ఈ డాషింగ్ బ్యాటర్ 40 బంతుల్లోనే 77 పరుగుల ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో కీలకమయ్యాడు.







## 110 కోట్ల వ్యూయర్‌షిప్

**రికార్డు స్థాయిలో ఐపీఎల్ వీక్షకులు..**

**టీవీ వ్యూయర్‌షిప్ 50 కోట్ల మార్కు క్రాస్**

టాటా ఐపీఎల్ 2026 వ్యూయర్‌షిప్‌లో సరికొత్త రికార్డును సాధించింది. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వ్యూయర్‌షిప్ ఈ సీజన్‌లో వచ్చింది. మొన్నటి వరకు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, ఫలితాల అనంతరం ప్రభుత్వాల ఏర్పాటుపై ఉత్కంఠ కొనసాగినప్పటికీ ఐపీఎల్ లీగ్ 19వ ఎడిషన్‌కు అభిమానుల్లో మాత్రం ఆదరణ తగ్గలేదు. టీవీ, డిజిటల్ కలిపి 1.1 బిలియన్ వ్యూస్ వచ్చాయని జియో హాట్ స్టార్ తెలిపింది. టీవీ వ్యూయర్‌షిప్ 50 కోట్ల మార్కును దాటినట్లు వెల్లడించింది. డిజిటల్ విభాగంలో 15 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు జియో తెలిపింది. మ్యాచ్ వీక్షించిన సమయం 7 శాతం పెరిగినట్లు పేర్కొంది. వ్యూయర్‌షిప్ ప్రాంతీయ భాషల్లో 42 శాతం పెరిగిందని జియో వెల్లడించింది. ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారడంతో వ్యూయర్‌షిప్ మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌ను అభిమానులు భారీగా ఆదరిస్తున్నారనేందుకు ఇదొక తార్కాణమని జియో స్టార్ సేల్స్ హెడ్ అనుప్ గోవిందన్ వెల్లడించారు. లీగ్ స్టేజ్‌లో ఇంకా మ్యాచ్ లు ఉన్నాయని, ప్రతి వారం పోటీల్లో తీవ్రత పెరుగుతోందని అన్నారు. అభిమానులు పెద్ద ఎత్తున చూస్తున్నారని పేర్కొన్నారు. ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారుతున్న వేళ, జియోస్టార్ ప్రతిదానిని అభిమానులకు చేరువ చేసేందుకు ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంటుందని అన్నారు.



## ఉప్పల్ మ్యాచ్ టికెట్ మినిమం 2,000

అభిమానులకు సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) షాకిచ్చింది. ఎస్ఆర్‌హెచ్ ఐపీఎల్ టిక్కెట్ల ధరలను భారీగా పెంచింది. ఈ నెల 22వ తేదీన ఉప్పల్ వేదికగా ఎస్ఆర్‌హెచ్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ జరగనుంది. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ మ్యాచ్ కోసం డిస్ట్రిక్ట్ యాప్‌లలో టిక్కెట్ల కోసం బుకింగ్ మొదలైంది. టిక్కెట్ల ధరలను రెండింతలకు పైగా పెంచడం గమనార్హం. రూ.950 టిక్కెట్ ధరను రూ.2 వేలకు, రూ.1,500 టిక్కెట్ ధరను రూ.3 వేలకు, రూ.1,910 టిక్కెట్ ధరను రూ.3,500కు, రూ.2,500 టిక్కెట్ ధరను రూ.4,500కు పెంచారు. అలాగే రూ.4,500 టిక్కెట్ ధరను రూ.6 వేలకు, రూ.7 వేల టిక్కెట్ ధరను రూ.10 వేలకు, రూ.23 వేల బాక్స్ టిక్కెట్ ధరను రూ.30 వేలకు, రూ.30 వేల కార్పొరేట్ బాక్స్ టిక్కెట్ ధరను రూ.45 వేలకు పెంచారు. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో సన్ రైజర్స్ మూడో స్థానంలో ఉంది. టోర్నీలో ఇప్పటివరకు 12 మ్యాచ్ లు ఆడిన ఎస్ఆర్ హెచ్ 7 విజయాలు నమోదు చేసింది.

ఈవార్తలు
# ప్రజావాణి
శనివారం 16-5-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు

సంపాదకీయం

Editorial

## రాజకీయ చదరంగంలో న్యాయవ్యవస్థ

భారత ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా, పౌరుల హక్కుల రక్షకుడిగా నిలవాల్సిన న్యాయవ్యవస్థ నేడు తీవ్రమైన విశ్వసనీయత సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కోర్టులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతున్నాయా? కొందరు జడ్జీలు కొన్ని కీలక తీర్పులను కావాలనే వాయిదా వేస్తున్నారా? అంటే, సామాన్య జనం నుండి మేధావుల వరకు 'అవును' అనే సమాధానమే ఎక్కువగా వినిపిస్తోంది. ఈ పరిస్థితి ప్రజాస్వామ్య మనుగడకే గొడ్డలిపెట్టుగా మారుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా కీలకమైన రాజకీయ, సామాజిక కేసులలో వస్తున్న తీర్పులు అధికార పక్షానికి అనుకూలంగా ఉంటున్నాయనే విమర్శలు తీవ్రమవుతున్నాయి. పదవీ విరమణ తర్వాత గవర్నర్ పదవులు, రాజ్యసభ సీట్లు, లేదా ఇతర ప్రభుత్వ కమిషన్లలో కీలక బాధ్యతలు దక్కుతుండటంతో కొందరు న్యాయమూర్తులు స్వతంత్రతను తాకట్టు పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొలీజియం వ్యవస్థ ద్వారా జడ్జీల నియామకాల్లో ప్రభుత్వం చూపే పట్టు, బదిలీల భయం కూడా న్యాయమూర్తులపై పరోక్ష ఒత్తిడిని పెంచుతోంది. సున్నితమైన రాజకీయ ప్రభావం చూపే కేసులను నెలల తరబడి, కొన్నిసార్లు ఏళ్ల తరబడి వాయిదా వేయడం వెనుక స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది. కొన్ని కీలక కేసుల విచారణలు ముగిసినా, తీర్పులను ఎన్నికలు ముగిసే వరకు రిజర్వ్‌లో ఉంచడం న్యాయవ్యవస్థ నిష్పాక్షికతను ప్రశ్నించేలా చేస్తోంది. పౌర హక్కులు, మానవ హక్కులకు సంబంధించిన అత్యవసర కేసుల కంటే, రాజకీయ ప్రాధాన్యత ఉన్న కేసులకు విపరీతమైన సమయం కేటాయించడం లేదా వాటిని పక్కన పెట్టడం జరుగుతోంది. సామాన్యుడికి న్యాయవ్యవస్థపై నమ్మకం పోతే దేశంలో అరాచకత్వం పెరుగుతుంది. న్యాయమూర్తులు కేవలం చట్టానికి, రాజ్యాంగానికి మాత్రమే జవాబుదారీగా ఉండాలి కానీ, పాలకుల రాజకీయ ప్రయోజనాలకు కాదు. "న్యాయం జరగడమే కాదు, జరుగుతున్నట్లు కనిపించాలి" అనే సూత్రం ఇక్కడ మృగ్యమవుతోంది. న్యాయవ్యవస్థ తన కోల్పోయిన వైభవాన్ని, నమ్మకాన్ని తిరిగి సంపాదించుకోవాలంటే అంతర్గత ప్రక్షాళన అత్యవసరం. పదవీ విరమణ తర్వాత జడ్జీలు ప్రభుత్వ పదవులు తీసుకోకుండా 'కూలింగ్ ఆఫ్ పీరియడ్' విధించాలి. కేసుల కేటాయింపులో (మాస్టర్ ఆఫ్ రోస్టర్) పారదర్శకత ఉండాలి. రాజకీయ ఒత్తిళ్లకు లొంగని ధీరత్వాన్ని న్యాయమూర్తులు ప్రదర్శించినప్పుడే భారత రాజ్యాంగం సురక్షితంగా ఉంటుంది.



## వినోదమా.. క్రికెట్ విధ్వంసమా?


ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్ అభిమానులకు తీవ్ర నిరాశను మిగులుస్తోంది. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన లీగ్, ఇప్పుడు కేవలం ఒక 'బ్యాటింగ్ ప్రదర్శన'గా మారిపోయి తన పూర్వ వైభవాన్ని కోల్పోయే ప్రమాదంలో పడింది. మహేంద్ర సింగ్ ధోనీ, రోహిత్ శర్మ లాంటి దిగ్గజ స్టార్లు లీగ్‌కు దూరం కావడం (గాయాలు లేదా విశ్రాంతి కారణాల వల్ల) ఒక ఎత్తయితే, మైదానంలో బ్యాట్, బాల్ మధ్య ఉండాల్సిన అసలైన సమతుల్యత పూర్తిగా లోపించడం టోర్నీని చప్పగా మార్చేస్తోంది. ప్రతి రోజూ బోర్ కొట్టించే భారీ స్కోర్లు, బౌలర్ల నిస్సహాయత ఇలాగే కొనసాగితే, రాబోయే కాలంలో ఐపీఎల్ ఒక విఫల ట్రోఫీగా మిగిలిపోయే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

దశాబ్ద కాలంగా ఐపీఎల్‌కు ఊపిరిగా నిలిచిన ధోనీ, రోహిత్ శర్మ వంటి వెటరన్ ఆటగాళ్లు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడం అభిమానులను తీవ్రంగా నిరాశపరుస్తోంది. కేవలం మ్యాచ్‌ల సంఖ్య పెరగడం, బ్రాండ్ వాల్యూ పెరగడం మాత్రమే విజయం కాదు; టెలివిజన్ వ్యూవర్‌షిప్‌లో దాదాపు 26 శాతం క్షీణత నమోదైనట్లు వస్తున్న నివేదికలు ఐపీఎల్ భవిష్యత్తుకు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. 220, 240 పరుగుల భారీ లక్ష్యాలను కూడా జట్లు చాలా సులభంగా ఛేదించేస్తున్నాయి. క్రికెట్‌లో ఉండే అసలైన ఉత్కంఠ కరువైంది. కుల్దీప్ యాదవ్ లాంటి అగ్రశ్రేణి స్పిన్నర్లు కూడా ఒక మ్యాచ్‌లో 3 ఓవర్లలో 41 పరుగులు సమర్పించుకునేలా పిచ్‌లు, నిబంధనలు మారాయి. టి.నటరాజన్ వంటి డెత్ ఓవర్ల బౌలర్ల ఎకానమీ రేటు 11 దాటిపోవడం బౌలర్ల దయనీయ స్థితికి అద్దం పడుతోంది. 2023లో ప్రవేశపెట్టిన ఈ నిబంధన, జట్లకు అదనపు బ్యాటర్‌ను ఉపయోగించుకునే లగ్జరీని ఇస్తోంది. దీనివల్ల వికెట్లు పడినా బ్యాటర్లు భయం లేకుండా హిట్టింగ్ చేస్తున్నారు. ఇది ఆల్‌రౌండర్ల పాత్రను తగ్గించడమే కాక, బౌలింగ్ విభాగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. క్రికెట్ అందం సిక్సర్లు, ఫోర్లలో మాత్రమే లేదు; ఒక అద్భుతమైన యార్కర్, లేదా స్పిన్ మాయాజాలంతో బౌలర్ బ్యాటర్‌ను ఇబ్బంది పెట్టడంలోనే అసలైన మజా ఉంటుంది. కానీ ప్రస్తుత ఐపీఎల్ పూర్తిగా కమర్షియల్ వినోదం వైపు మొగ్గుచూపింది. పిచ్‌లను పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలంగా మార్చడం వల్ల బౌలర్లు కేవలం 'బౌలింగ్ మిషన్లు'గా మారిపోయారు. ఐపీఎల్ కేవలం డబ్బులు కురిపించే యంత్రంగానే మిగిలిపోకూడదంటే భారత క్రికెట్ నియంత్రణ మండలి తక్షణమే పునరాలోచించాలి. బౌలర్లకు సహకరించేలా, కనీస స్పిన్, స్వింగ్‌కు అనుకూలించే పిచ్‌లను సిద్ధం చేయాలి. 'ఇంపాక్ట్ ప్లేయర్' రూల్‌ను 2027 వరకు కొనసాగిస్తామని బోర్డు చెప్తున్నప్పటికీ, ఆటలోని సమతుల్యత కోసం దీనిని తక్షణమే సమీక్షించాల్సిన అవసరం ఉంది. వ్యాపార ప్రయోజనాల కోసం ఆట ఆత్మను చంపేస్తే, లీగ్ తన ఉనికిని కోల్పోతుంది. ప్రేక్షకుడికి వినోదంతో పాటు నాణ్యమైన క్రికెట్ అందించినప్పుడే ఐపీఎల్ సుదీర్ఘకాలం మనగలుగుతుంది.

- రాజేందర్ కట్కం

## ఇంటర్ విద్యలో విప్లవాలు

తెలంగాణ విద్యా వ్యవస్థలో అత్యంత కీలకమైన, సున్నితమైన ఘట్టం ఇంటర్మీడియట్ విద్య. ఏటా పది లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ఈ రెండేళ్ల కాలం.. ప్రస్తుతం వ్యాపారీకరణ కోరల్లో చిక్కుకుని కొట్టుమిట్టాడుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ విద్యా కమిషన్ సిఫార్సుల మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఇంటర్ విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టడం స్వాగతించదగ్గ పరిణామం.



సీబీఎస్ఈ తరహాలోనే ఇంటర్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసి, 11, 12 తరగతులుగా మార్చాలనే ప్రతిపాదన, అలాగే ఇంటర్ ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్, ఇంటర్నల్ మార్కుల విధానాన్ని తేవడం విద్యా రంగంలో సరికొత్త ఆశలు రేకెత్తిస్తోంది. అయితే, ఈ చారిత్రాత్మక సంస్కరణల అమలులో ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల ఒత్తిళ్లకు లొంగుతుందా? లేక విద్యార్థుల ప్రయోజనాలే పరమావధిగా మొండిగా ముందుకు సాగుతుందా? అన్నదే ఇప్పుడు మిగిలి ఉన్న మిలియన్ డాలర్ల ప్రశ్న. దేశవ్యాప్తంగా విద్యా ఫలితాలను పరిశీలిస్తే ఇంటర్‌ను పాఠశాల విద్యలో భాగంగా కొనసాగిస్తున్న రాష్ట్రాల్లో డ్రాపౌట్ల సంఖ్య గణనీయంగా తక్కువగా ఉంది. తెలంగాణలో మాత్రం పదో తరగతి పూర్తయ్యాక వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారు, ప్రత్యేక జూనియర్ కళాశాలల్లో చేరలేక చదువుకు స్వస్తి పలుకుతున్నారు. ఈ అంతరాన్ని పూడ్చేందుకే రేవంత్ రెడ్డి సర్కార్ "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల" ద్వారా ప్లస్ టూ (11, 12 తరగతులు) విధానాన్ని తీసుకురావాలని సంకల్పించింది. ఈ ఏకీకృత విధానం ద్వారా కేంద్రం నుంచి 'సమగ్ర శిక్షా' వంటి పథకాల కింద వందల కోట్ల నిధులు రావడమే కాకుండా, విద్యార్థులకు ల్యాబ్‌లు, గ్రంథాలయాలు ఒకేచోట అందుబాటులోకి వస్తాయి. కానీ, ఈ మార్పులను అడ్డుకోవడానికి కార్పొరేట్ విద్యా సంస్థల లాబీయింగ్ ఇప్పటికే తెరవెనుక ప్రయత్నాలు ప్రారంభించిందనే ప్రచారం జరుగుతోంది. ఇంటర్ బోర్డు ప్రత్యేకంగా ఉంటేనే ర్యాంకుల వ్యాపారం, విద్యార్థులపై మానసిక ఒత్తిడి తెచ్చి ఫీజుల దోపిడీ చేయడం సాధ్యమవుతుంది. స్కూల్ విద్యలో ఇంటర్ విలీనమైతే తమ ఏకాధిపత్యానికి గండి పడుతుందనేది వారి భయం. తాజాగా, సాంకేతిక, చట్టపరమైన కారణాల (1971 ఇంటర్ విద్యా చట్టం రద్దు వంటివి) వల్ల ఈ విద్యా సంవత్సరానికి (2026-27) ప్రవేశాలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ తాత్కాలిక వాయిదా వెనుక కార్పొరేట్ కాలేజీల ఒత్తిడి ఉందా? లేక నిజంగానే విద్యార్థులకు గందరగోళం కలగకూడదనే ఉద్దేశం ఉందా? అన్న అనుమానాలు సామాన్యుల్లో కలగడం సహజం. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో వెనక్కి తగ్గకూడదు. ప్రస్తుతం కేవలం సమయాభావం వల్లే అడ్మిషన్లను పాత పద్ధతిలో అనుమతించినా, ఇంటర్ బోర్డు ద్వారా పరీక్షల సరళిని మార్చడం (ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్, 80 మార్కులకు థియరీ) వంటి కీలక సంస్కరణలను ఈ ఏడాది నుంచే అమలు చేస్తుండటం మంచి పరిణామం. కానీ, అంతిమ లక్ష్యమైన విలీన ప్రక్రియపై అసెంబ్లీలో విస్తృత చర్చ జరిపి, మేధావులు, ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలు సేకరించి చట్టబద్ధమైన ఆర్డినెన్స్ తేవాల్సి ఉంది. విద్య అనేది వ్యాపార సరుకు కాదు, అది రాబోయే తరాల భవిష్యత్తుకు పెట్టుబడి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్పొరేట్ కాలేజీల లాబీయింగ్‌కు తలొగ్గకుండా, విద్యార్థుల ఆత్మహత్యలకు నిలయాలుగా మారిన ఒత్తిడి విద్యా విధానానికి చరమగీతం పాడాలి. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు పెంచి, జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఏకీకృత బోర్డును ఏర్పాటు చేయడమే ఈ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. కార్పొరేట్ ఒత్తిళ్లను చిత్తు చేసి, తెలంగాణను విద్యా హబ్‌గా మార్చే చారిత్రాత్మక సంస్కరణల దిశగా రేవంత్ రెడ్డి సర్కార్ అడుగులు బలంగా పడాలి.



**చుక్కల శ్రీకాంత్**
నిజామాబాద్

## ప్రజాస్వామ్య పునాదులకు పటిష్ట రక్షణ

ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికలే ప్రాణాధారం. పారదర్శకమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరిగినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యానికి అర్థం సిద్ధిస్తుంది. ఈ క్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, వ్యవస్థను పట్టిపీడిస్తున్న 'దొంగ ఓట్ల' వ్యాధికి చరమగీతం పాడటం అత్యంత కీలకం. దేశ ఎన్నికల చరిత్రలో సరికొత్త సంస్కరణల ద్వారా ఈ సవాలును అధిగమించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చూపిస్తున్న చొరవ, పట్టుదల ముదావహం. గతంలో ఒకే వ్యక్తికి బహుళ ప్రాంతాల్లో ఓట్లు ఉండటం, మరణించిన వారి పేర్లు జాబితాలోనే కొనసాగడం వంటి లోపాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేవి. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రంగంలోకి దించింది. ఆధార్ కార్డుతో ఓటరు గుర్తింపు కార్డుల అనుసంధానం, ఫొటో సిమిలారిటీ సాఫ్ట్‌వేర్ల వినియోగం ద్వారా నకిలీ, డూప్లికేట్ ఓట్లను వ్యవస్థ నుంచి సమూలంగా తొలగిస్తోంది. శతాబ్దపు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో కోట్లాది ఓటర్ల డేటాను పరిశీలించి, అర్హులకే ఓటు హక్కు మిగిలేలా చేయడం సామాన్యమైన విషయం కాదు. ఎన్నికల ప్రక్రియపై సామాన్య పౌరుడికి నమ్మకం కలిగినప్పుడే వ్యవస్థ బలోపేతమవుతుంది. బూత్ స్థాయి అధికారుల నిరంతర సర్వేలు, ఆన్‌లైన్ ద్వారా ఓటర్ల నమోదు మరియు సవరణలకు కల్పించిన సౌలభ్యం ఎన్నికల సంఘం పనితీరును ఆధునీకరించాయి. రాజకీయ పక్షాల విమర్శలకు తావివ్వకుండా, పూర్తి పారదర్శకతతో దొంగ ఓట్ల ఏరివేత ప్రక్రియను నిర్వహించడం ద్వారా కమిషన్ తన స్వయంప్రతిపత్తిని, నిష్పాక్షికతను చాటుకుంది. స్వచ్ఛమైన ఓటర్ల జాబితాయే పటిష్టమైన ప్రజాస్వామ్యానికి మొదటి అడుగు. నకిలీ ఓట్లను ఏరివేయడం ద్వారా నిజమైన ప్రజా తీర్పు వెలువడేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చేస్తున్న ఈ కృషి అభినందనీయం. భవిష్యత్తులోనూ ఇదే పట్టుదలతో సాంకేతిక లోపాలకు తావులేకుండా, అర్హులైన ఏ ఒక్క పౌరుడూ ఓటు హక్కు కోల్పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత కమిషన్‌పై ఉంది. ఓటర్ల జాబితా ప్రక్షాళనలో ఎన్నికల సంఘం సాధిస్తున్న పురోగతి దేశ ప్రజాస్వామ్య ప్రయాణంలో ఒక మైలురాయిగా నిలుస్తుంది.

- విద్యారాణి పూరడి

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.